ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

3

గురువారం 18 జనవరి 2024



● నరసరావుపేట ప్రాంతంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న మిరప పంట

ప్రయోగాలు ప్రహసనం

ఇంటర్ కళాశాలల్లో అరకొరగానే ల్యాబులు

- సౌకర్యాలు, పరికరాలపై పట్టించుకోని బోర్డు
- ల్యాబు ఫీజు పేరుతో ప్రైవేటు యాజమాన్యాల దోపిడీ
- ప్రయోగ పరీక్షా కేంద్రాల్లో తూతూమంత్రంగా వార్షిక తనిఖీలు



గుంటూరు(విద్య), జనవరి 17: ఇంటర్ మీడియట్ సైన్సు గ్రూపుల విద్యార్థులకు ఆయా సబ్జెక్టులతో పాటు ప్రయోగ పాఠాలు కూడా ముఖ్యమే. అయితే పలు కళా శాలల్లో ల్యాబులు, పరీక్షలు ఓ ప్రహస నంగా మారాయి. మొదటి సంవత్సరం నుంచి కళా శాలల్లో ప్రయోగాలకు సంబంధించి బోధన చేయాలి. ద్వితీయ సంవత్సరంలో వాటికి సంబంధించి పరీక్షలు ఉంటాయి. ఇందులో భాగం గా ఇంటర్ మీడియట్ కళాశాలల్లో ప్రత్యేకంగా ల్యాబులు, ప్రయోగ రసా యనాలు, పరికరాలు, బోధకులు తప్ప నిసరి. అయితే అరకొర కళాశాలల్లోనే ఇంటర్ బోర్డు నిబం ధనలకు అనుగుణంగా ల్యాబులు ఉంటున్నాయి. అనేక ప్రైవే టు కళాశాలల్లో ల్యాబులే ఉండవు. ఆయా కళాశాల ల్లో చదివే విద్యార్థులకు ప్రయోగాలు అంటే ఏమిటో కూడా తెలియదంటే ఆశ్చర్యం కాదు. ఒకవేళ ఏదైనా కళాశాలలో పేరుకే ల్యాబు ఉంటుంది.. అందులో అవ సరమైన పరిక రాలు ఉండవు.. ఇక బోధకలు అసలే ఉండరు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో వారంలో ఒక రోజు ల్యాబుల్లో ప్రయోగాలు చేయించాలని నిబంధనలు ఉన్నా యాజమాన్యాలు మాత్రం సంవత్సరం చివర వరకు ల్యాబుల్లో వారిని అడుగుపెట్టనీయడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని ల్యాబుల్ని వార్షికంగా తనఖీ చే యాల్సిన ఇంటర్ బోర్డు మిన్నకుండి పోతున్నదనే ఆరోప ణలున్నాయి. ల్యాబుల్లో సరైన పరికరాలు ఉన్నాయా? ఉంటే వాటి పనితీరు ఎలా ఉంది? విద్యార్థులు ఉపయో గించాల్సిన రసాయనాలు, వాటిని ఎలా ఎంత మోతాదులో ఉపయోగించాలి. వచ్చిన ఫలితాన్ని ఎలా నమోదు చేయా లి అనే విషయాలు స్పష్టంగా రికార్డుల్లో నమోదు చేయాలి. ఇందుకోసం కెమిస్ట్రి, ఫిజిక్స్, బోటనీ తదితర సబ్జెక్టుల్లో నిష్ణాతులైన అధ్యాపకుల్ని ఓ కమిటీగా నియమించి పరిశీ లన చేయించాలి. అయితే ఇవేమి పట్టించుకోకుండానే ఇం టర్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తుందనే ఆరోపణలున్నాయి.

వచ్చే నెలలో ప్రయోగ పరీక్షలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దాదాపు 48 వేల మంది ఉన్నట్లు సమాచారం. ఇంటర్ బోర్డు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి రెండోవారం నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. ఇందు కోసం మొత్తం 140పైగా కేం ద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యా ర్థులకు షెడ్యూల్ వారీగా పరీక్షలు నిర్వహించనున్నా రు. అయితే కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఉన్నా యో లేదో పరిశీలించడం లేదనే ఆరోపణలున్నాయి. అసలు ప్రయోగాలు అంటే ఏమిటో తెలి యకుండా సైన్సు గ్రూపుల విద్యార్థులు ఏమి పరీక్ష లు రాస్తారో ఎవరికీ తెలియదు.

ఇక్కడ వసూళ్లు.. అక్కడ చెల్లింపులు..

ఇంటర్ బోర్డు నిర్వహించే ప్రయోగ పరీక్షలకు ప్రైవే టు, కార్పొరేట్ యాజమాన్యాలు భారీగానే ఫీజులు వసూ లు చేస్తున్నాయి. ఇంటర్ బైపీసీ విద్యార్థుల నుంచి రూ.1500, ఎంపీసీ విద్యార్థుల నుంచి రూ.1000 చొప్పున కొన్ని కళాశాలలు వసూలు చేస్తున్నాయి. ల్యాబ్ ఫీజు పేరుతో వసూలు చేసే ఈ మొత్తంలో సగం ఇంటర్ బోర్డు కు అనధికా రికంగా చెల్లించి, మరికొంత పరీక్షల సమ యంలో వచ్చే ఇన్విజిలేటర్లకు చెల్లిస్తారనే ఆరోపణలు న్నాయి. ఫలితంగా ప్రయోగ పరీక్షల్లో ఇన్విజిలేషన్ చూసీ చూడనట్లు ఉంటారనే ఆరోపణలున్నాయి. ఇలా ఏ టా ప్రయోగ పరీక్షలు ఓ ప్రహసనంగా నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ధీమా ఇవ్వని బీమా

ప్రకృతి పంటల సాగుకు సహకరించడంలేదు. తీవ్ర వర్షాభావం.. కుండపోత వర్షాలు ఇలా అతి వృష్టి, అనావృష్టి రైతులను దారుణంగా దెబ్బతీశాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట డిసెంబరు నెలలో కురిసిన అతి భారీ వర్షాలకు వర్షార్పణం అయింది. సాధారణం కన్నా వెయ్యింతల అధిక వర్షపాతం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో నమోదైంది. మిరప పంటకు అపార నష్టం వాటిల్లింది. ఈ తరుణంలో రైతులకు వాతావరణ ఆధారిత బీమా పథకం నుంచి పరిహారం అందించాలి. అయితే అధికారులు కానీ, ప్రభుత్వం కానీ బీమా విషయంలో పట్టీపట్టనట్లు వ్యవహ రిస్తున్నా రు. పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం కన్నా 4969.88 శాతం, బాపట్ల జిల్లాలో 3348.35 శాతం, గుంటూరు జిల్లాలో 6567.86 శాతం అత్యధి కంగా వర్షపాతం నమోదైనట్లు వాతా వరణ శాఖ నివేదికలు తెలియజేస్తున్నాయి.

- తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతులు
- బీమా గురించి పట్టించుకోని అధికారులు
- డిసెంబరు నెలలో రెట్టింపు వర్షపాతం నమోదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని ప్రవేశ పెట్టింది. దానిలో మిర్చి పంటను కూడా చేర్చింది. సాధా రణ పంటల బీమాకు, వాతావరణ ఆధారిత బీమాకు పూర్తిగా వ్య త్యాసం ఉంది. సాధారణ పంటల బీమా అమలులో సాగు చేసిన పంటలో 33 శాతం పూర్తిగా పంట దెబ్బతింటేనే నష్ట పరిహారం చెల్లిస్తారు. వాతావరణ ఆధారిత బీమ పథకం అలా ఉండదు. ఈ బీమా పథకం కింద అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత, అధిక గాలి, సాధారణం కంటే తక్కువ వర్షపాతం, తేమ వంటి ప్రతికూల పరిస్థితుల కారణంగా కలిగే పంట నష్టాలకు బీమా వర్తిస్తుంది. వా తావరణ శాఖ వర్షపాతం నివేదికల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేస్తారు. అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతింటే పరి హారం చెల్లిస్తారు. తీవ్ర వర్షాభావం వలన కలిగే నష్టాలకూ పరిహారం అందిస్తారు. పంట వివిధ స్టేజ్‌లలో అధిక వర్షాలు, వర్షాభావం వల న కలిగే నష్టాన్ని నమోదు చే యాల్సి ఉంది. పంటకు బీమా ప్రీమియం చెల్లించే ప్రతి రైతు ఈ పథకం కింద అర్హులే. రైతుల తరుపున తామే బీమా ప్రీమియం చెల్లిస్తున్నా మని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం గా ప్రకటించింది. అంతే కాకుండా ఈ క్రాప్ న మోదు, ఈకేవైసీ చేయించుకున్న ప్రతి రైతు పంటల బీమాకు అర్హుడని ప్రకటిం చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు మిరప సాగు చేసిన రైతులందరికీ ఈకేవైసీ పూర్తి చేసినట్టు ఉద్యాన శాఖ అధికారులు ప్రకటించారు. అంటే మిర్చి సాగు చేసిన రైతులందరికీ బీమా వర్తిం చినట్లే. అధికారిక లెక్కల ప్రకారం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,89,770 ఎకరాల్లో మిరప సాగైంది. అత్యధికంగా పల్నాడు జిల్లాలో 1,25,881 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 25,337 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 38,550 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ సంవత్సరం మిరప మొక్కలు నాటిన నాటి నుంచి తీవ్ర వర్షాభావం నెలకొంది. అంతే కాకుండా డిసెంబరు నెలలో అతి భారీ వర్షాలు కురిశాయి. ఇలా రెండు విధాలా మిరప రైతులు నష్టపోయారు. మిరప తొలికాపు దశలో అధిక వర్షాలు కురిశాయి. దీని వలన దిగుబడులను కోల్పోయారు. ఎకరాకు సగటున 30 శాతంకు పైగా మొక్కలు ఎండి పోయి ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ళ వరకు దిగుబడులను రైతులు కోల్పోయారు.

అతి భారీ వర్షాలు.. తీవ్ర వర్షాభావం ఇలా..

డిసెంబరు 5,6 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. ఈ రెండు రోజుల్లో పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం 3.22 మీ.మీ కాగా 163.25 మీ.మీ వర్షపాతం నమోదైంది. 4969.88 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. బాపట్ల జిల్లా సాధారణ వర్షపాతం 5.77 మీమీ కాగా 198.97 మీమీ వర్షపాతం నమోదైంది. 3348.35 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లాలో సాధారణ వర్షపాతం 2.52 మీమీ కాగా168.03 వర్షపాతం నమోదైంది. 6567.86 శాతం అధికంగా వర్షపాతం న మోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అక్టోబరు నెలలో తీవ్ర వర్షా భావం నెలకొంది. పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం 118.21 మీమీ కాగా 22.34 మీ.మీ వర్షపాతం నమోదైంది. 81.1 శాతం లోటు వర్షపాతం నెలకొంది. బాపట్ల జిల్లాలో సాధారణ వర్షపాతం 171.92 మీ.మీ కాగా 34.43 మీ.మీ వర్షపాతం నమోదైంది 79.97 శాతం లోటు వర్షపాతం నమో దైంది. గుంటూరు జిల్లాలో సాధారణ వర్షపాతం 128.8 మీ.మీ కాగా 25.9 మీ.మీ వర్షపాతం నమోదు కావడంతో 79.89 శాతం లోటు వర్షపాతం నెలకొంది. అక్టోబరులో తీవ్ర లోటు వర్షపాతం, డిసెంబరు నెలలో వేల రెట్ల అధిక వర్షపాతం నమోదు కావడంతో మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలా జరిగిన పంట నష్టం వాతావారణ ఆధారిత బీమా కిందకు వస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికలు ఆధారంగా, పంట నష్టం కోసం మిరపకు ఉద్యాన శాఖ నివేదికలు పంపించాల్సి ఉంటుంది. ఈ దిశగా సదరు శాఖ స్పందిస్తున్న దాఖలాలు లేవు. వాతావరణ బీమా పథకం కింద పరిహారం అందుతుందా లేదా అన్న ఆందోళన బాధితుల రైతుల నుంచి వ్యక్తమవుతున్నది. అధిక వర్షాల వలన పంటలను కోల్పోయిన రైతులకు బీమా ఆదుకునే అవకాశం ఉన్నా ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. వాతావరణ బీమా కింద మిరపకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

సున్నా వడ్డీకి.. సున్నాయేనా..?

- ఖరీఫ్ ముగిసినా కరుణించని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 54 వేల మందికి శఠగోపం
- ఎన్నికల కోడ్ సమీపిస్తోన్నా నిధుల విడుదలపై మౌనం
- రైతులకు దక్కాల్సిన రూ.16 కోట్లకు పంగనామాలు

గుంటూరు సిటీ, జనవరి 17: ఆరుగాలం రెక్కల కష్టంపై ఆధారపడుతూ.. ప్రకృతి వైపరీత్యాలను.. అతి వృష్టి.. అనా వృష్టిలని ఎదుర్కొని అందరికీ అన్నం పెడు తున్న రైతులపై వైసీపీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. అన్నదాతలకు కల్పించే చిన్నా చితక ప్రయోజనాలపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. సున్నా వడ్డీ పథకానికి నాలుగేళ్లకే నూరేళ్లు నిండినట్లు కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ దాటిపోయినా వడ్డీ రాయితీ సొమ్మును రైతుల ఖాతాల్లో ఇంతవరకు జమ చేయలేదు. నేడో రేపో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నప్పటికీ సున్నా వడ్డీ నిధులపై ప్రభుత్వం మితిమీరిన మౌనాన్ని ప్రదర్శిస్తుం ది. ఆయా జిల్లాల నుంచి సున్నా వడ్డీ రాయితీ పొం దేందుకు అరు లైన రైతుల వివరాలు అధికార యంత్రాం గం సిద్ధం చేసి పంపింది. అయినా నిధుల విడుదల విషయాన్ని ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచుతు న్నారు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 54 వేల మంది రైతుల రాయితీ ప్రయోజనంపై దెబ్బపడింది. రైతులు తీసుకున్న పంట రుణాల పై పూర్తిగా వడ్డీ మాఫీ చేయడం సున్నా వడ్డీ పథకం ముఖ్య ఉద్దేశం. రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గొప్పగా ప్రకటించారు. 2020లో సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించారు. ప్రారం భించిన రెండేళ్లు హడా వుడి చేశారు. మూడో ఏడాది నుంచి నిధుల విడుదల నత్తనడకన సాగగా, నాలుగో ఏట అసలు నిధుల విడుదల ప్రస్తావనే లేకుండా పోయింది. ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందన్న ఆశతో రైతులు పంటలు పండినా పండక పో యినా అప్పు చేసి మరీ బ్యాంకులకు రుణాలు చెల్లించారు. గుంటూరు జిల్లాలో 12,208 మంది, పల్నాడు జిల్లాలో 23,271 మంది, బాపట్ల జిల్లాలో 18,227 మంది రైతులు సకాలంలో రుణా లను బ్యాంకులు, సహకార సంఘాలకు చెల్లించారు. వీరంతా సున్నా వడ్డీ కింద లబ్ధి పొందేం దుకు అర్హులేనని వ్యవ సాయ శాఖ జాబితా సిద్ధం చేసింది. ప్రతి ఏటా పంట సీజన్ ముగిసే నాటికి రైతుల ఖాతాల్లో వడ్డీ డబ్బులు జమ వుతాయని అప్పట్లో ముఖ్యమంత్రి బహిరంగంగా ప్రకటిం చారు. రైతులు సకాలంలో రుణం చెల్లిస్తే సరిపో తుంది వడ్డీ సొమ్ము ఖాతాల్లో జమ అవుతుందని బీరాలు పలికారు. లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకున్న వారికి వడ్డీ మొత్తం ప్రభుత్వం చెల్లిస్తుం దని ఊదరగొట్టారు. ఈ లెక్కన 2022 -2023 ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులకు అక్షరాల రూ.16 కోట్లు ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేయా ల్సి ఉంది. గుంటూరు జిల్లాలో రూ.3 కోట్ల 40 లక్షలు, పల్నా డు జిల్లాలో రూ.7 కోట్ల 19 లక్షలు, బాపట్ల జిల్లాలో రూ.5 కోట్ల 20 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంది. సీజన్ ముగిసినా ఏ ఒక్క రైతు ఖాతాలో రూపాయి కూడా జమ కాలేదు.



'కోడ్' కూస్తే అనుమానమే

సున్నా వడ్డీ నిధులపై అధికార యంత్రాంగం ఏమీ చెప్పలేక పోతుం ది. ఇప్పటికే జాబితాలు పంపినప్ప టికీ వాటిని పూర్తిగా పరిగణనలోకి తీసు కున్న దాఖలాలు కనిపిం చటం లేదని కొందరు ఉద్యోగులు చెబుతు న్నారు. ఎన్నికల కోడ్ వస్తే సున్నా వడ్డీ నిధుల విడుదల అనుమానమే నని అంటున్నారు.



గుంటూరు రైల్వే పశ్చిమ టెర్మినల్ ప్రారంభం

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే స్టేషన్ వెస్టు టెర్మినల్ ప్రయాణికులకు అందు బాటులోకి వచ్చింది. నూతనంగా నిర్మించిన ఈ టెర్మినల్‌ని ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా రైల్వే శాఖ ప్రారంభించింది. దీంతో ప్రయాణికులకు రెండు వైపుల నుంచి ప్రవే శించే సదుపాయం కల్పించినట్లైంది.



ఇక అరండల్‌పేట వైపు నుంచి కూడా రాకపోకలు

అన్‌రిజర్వుడ్ టిక్కెట్ల జారీకి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. అలానే ఇప్పటి వర కు అరండల్‌పేట ఒకటో లైనులో బుక్ స్టాల్స్ మధ్య ఉన్న ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్లని వెస్టు టెర్మినల్‌లోకి తీసుకొచ్చేశారు. దీంతో ప్రయాణికులు రిజర్వేషన్ టిక్కె ట్ల బుకింగ్ కోసం వెస్టు టెర్మినల్‌లోకి వెళ్లాల్సి ఉం టుంది. దాదాపుగా రూ.29 కోట్ల వరకు వెచ్చించి అధు నాతన సౌకర్యాలను వెస్టు టెర్మినల్ వైపు కల్పించారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల ఏర్పాటుతో ప్రయాణికులు సుల భతరంగా ప్లాట్‌ఫాంల పైకి చేరుకోవచ్చు. అలానే సువి శాలమైన పార్కింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అమరావతి సంస్కృతి ఉట్టిప డేలా స్టేషన్ పశ్చిమ వైపు భవనాన్ని తీర్చిదిద్దారు. వెస్టు టెర్మినల్ ప్రయాణికులకు కొత్త అనుభూతిని పంచుతుందని రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు.

టీడీపీలోకి 50 కుటుంబాలు

లోకేశ్‌తోనే సమగ్రాభివృద్ధి అన్న వైసీపీ శ్రేణులు

మంగళగిరి సిటీ, జనవరి 17: నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం కలిసి రావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలు పునకు అన్ని వర్గాలను ఆలోచింపజేస్తోంది. లోకేశ్‌తోనే అభివృద్ధి సాధ్య మవుతుందని భావించిన వైసీపీ శ్రేణులు టీడీపీ వైపు ఆకర్షితు లవుతున్నారు. తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన వైసీపీ ముఖ్య నేత డాకారపు అప్పారావు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు, బీసీ నేతలు వంగా సత్యనారాయణ, అట్ల శ్రీనివాసరావు నేతృత్వంలో మరో పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి లోకేశ్ పసుపు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధికి లోకేశ్ రూపొందించిన ప్రణాళికలు బాగున్నా యని తెలిపారు. లోకేశ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, ప్రము ఖులు తనకు మద్దతుగా నిలవడం సంతోషమని, తనపై ఉంచిన నమ్మ కాన్ని వమ్ముచేయబోనని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, నా యకులు లామ్ నరేష్, దొప్పలపూడి జ్యోతిబసు, గాదె వినయ్, వల్లభా పురం శంకర్, వంగా నరేంద్ర, సనక బుజ్జి, కూనపరెడ్డి రమేష్, పద్మా కమలనాభుడు, బొబ్బారవితేజ, లీలాకృష్ణ, సురేంద్ర పాల్గొన్నారు.



50 కుటుంబాలతో కలిసి లోకేశ్ అభివాదం

వైసీపీలో ఎవడైన చేరతాడా ?

- అది నీతి, జాతి లేని పార్టీ ..
- ఆ పార్టీని సమాజం నుంచే వెలివేయాలి
- మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్వజం
- చివరి శ్వాస వరకు టీడీపీలోనే.. మరోసారి స్పష్టం



గుంటూరు(తూర్పు), జనవరి17: వైసీపీ నీతి, జాతి లేని పార్టీ.. ఆ పార్టీలోకి ఎవడైన చేరతాడా? అంటూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ గురజాల నియోజకవవర్గ ఇన్‌చార్జి యరపతినేని శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన చివరి శ్వాసవరకు టీడీపీలోనే ఉంటానని, జగన్ పత్రిక, వైసీపీ సోషల్‌మీడియా ఆడుతున్న విష క్రీడకు భయపడనని స్పష్టం చేశారు. రాజకీయాల్లోనే కాదు.. సమాజం నుంచే వైసీపీని వెలివేయాలంటూ ఆయన ఘాటుగా స్పందించారు. బుధవారం గుంటూరు నగరంలోని విద్యానగర్‌లో గల ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ... జగన్ సొంత పత్రిక, సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని తనపై, కుటుంబ సభ్యులపై జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీలోకి జగన్ రావడం ఎంత నిజమో యరపతినేని వైసీపీలోకి రావడంకూడా అంతే నిజమని వ్యంగ్యంగాచెప్పారు. గురజాల నియోజకవర్గంతో తనకు విడదీయని అనుబంధం ఉందని, టీడీపీ తరుపున ఆరుసార్లు పోటీ చేసానని, 7వ సారీ పోటీ చేయబోతున్నట్టు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఇంటికి పంపడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే సజ్జల భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో సోషల్ మీడియాలో తనపై ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. నాలుగేళ్లుగా టీడీపీని తిట్టించి ఇప్పుడు వారికే టికెట్లు ఇవ్వకుండా జగన్ రెడ్డి వారి గొంతు కోశారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఎవరెన్ని చెప్పినా జగన్, ఆయన పరివారం జీవితాంతం జైల్లోనే ఉంటారని స్పష్టం చేశారు. గురజాల నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చేస్తున్న అక్రమాలపై విచారణ తప్పదని హెచ్చరించారు. పిడుగురాళ్లలో పది ఎకరాలు దేవదాయ భూమిని అన్యాక్రాంతం చేసారని, ఈ ఘటనలో అధికారులపాత్రపై విచారణ జరుపుతామన్నారు. అధికారంలోకి రాగానే గురజాల కేంద్రంగా పల్నాడుజిల్లాను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే గురజాల అభివృద్ధి కోసం జనసేన-టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టోను రూపొందించామని. దానిని త్వరలోనే ప్రకటిస్తామని యరపతినేని తెలిపారు.



రైల్ సేవా పురస్కార్ అవార్డు గ్రహీతలతో డివిజనల్ రైల్వే మేనేజర్ రామకృష్ణ

గుంటూరు డివిజన్‌కి

'రైల్ సేవా పురస్కార్' అవార్డులు

గుంటూరు సిటీ, జనవరి 17 : గుంటూరు డివిజన్ రైల్ సేవా పురస్కార్ అవార్డులు దక్కించుకుంది. 68వ రైల్వేవీక్ అవార్డులు-2023వ సంవత్సరంలో ప్రతిభ కనువరచిన అధికారులు, ఉద్యోగులకు బుధవారం అందజేశారు. గుంటూరులోని పట్టాభిపురం రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌స్థాయిలో 13 మంది రైల్‌సేవా పురస్కార్ అవార్డులు అందుకున్నారన్నారు. వారిలో ఖాతా శాఖకు చెందిన అధికారి ఏడీఎఫ్ ఎం.షణ్ముఖేశ్వరరావు, మెడికల్ బ్రాంచ్ అధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌లతో పాటు వివిధ శాఖలకు చెందిన వైఎస్ పద్మారావు, వీ.దుర్గాప్రసాదు, ఎస్.అంకమ్మరాజు, ఎస్.కోటన్‌రాజు, వీ.రామ శేషారెడ్డి, డీ.పద్మ, వీ.నాగరాజు, వై.కరుణకుమార్, కె.శామ్యూల్ ప్రసాద్, సీహెచ్ సురేష్, పీ.వేణు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కే. సైమన్, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రభాకర్ రాజు, రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ షాహబాజ్ హనూర్, పలువురు అధికారులు పాల్గొన్నారు

మాతృభాషను మరవొద్దు..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వెంకయ్యనాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

- గుడి ఎంత పవిత్రమైనదో బడి అంతే పవిత్రమైనది
- విశ్వగురువుగా అవతరించనున్న భారతదేశం
- వ్యవసాయం మన ప్రాథమిక సంస్కృతి
- మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

నరసరావుపేటటౌన్, జనవరి17: కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను, మాతృ దేశాన్ని, గురువును మరచినవాడు మనిషేకాదని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. బుధవారం పల్నాడుజిల్లా నరసరావుపేటలో కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఇంగ్లీషు నేర్చుకోండి కానీ పిల్లవాడిని ఇంగ్లీషువాడీగా తయారు చేయవద్దన్నారు. నూతన విద్యావిధానంతో పాటు విద్యను భారతీకరణ చేయాలన్నారు. ఇంట్లో, వీధిలో, గుడిలో, బడిలో, అమ్మ వడిలో నుంచి వచ్చిన మాతృభాష అందరికి అలవాటు చేయాలన్నారు. మాతృభాష కళ్ళలాంటివి అని, ఇంగ్లీషు కళ్ళ అద్దలాంటివి అన్నారు. ముందు భాషనేర్చుకోవాలని, తర్వాత విషయం నేర్చుకోవాలన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలో ఉంటే విషయం నేరుగా మనస్సులోకి వెళ్ళ తుందన్నారు. మొదట మాతృభాష, తర్వాత సోదర భాష, ఆతర్వాత ఇతర భాషలు నేర్చుకోవాలన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన మంత్రి వీళ్ళందరూ మాతృ భాషలో చదువుకొని పైకొచ్చారన్నారు. గుడి ఎంత పవిత్రమైనదో బడి అంతే పవిత్రమైనదన్నారు. ఆధునిక పోకడలతో టీవీ, మొబైల్ ఫోన్‌వంటి వాటికి అలవాటిపడి స్వంత ఆలోచనలు తగ్గిపోయి విద్యార్థుల మనస్సుల్లో జడత్వం నాటుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు విజ్ఞానం, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ముఖ్యమైనప్పటికీ, వాటితో పాటు ప్రాపంచిక పరిజ్ఞానం అతి ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చెట్ల మధ్యన విద్యాసంస్థల ఆవరణం, పరిసరాలు ఉండాలన్నారు. అలాగే కొంత ఖాళీ స్థలం ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆస్థలంలో నిర్వహించే క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. యోగ నేర్చుకోవాలన్నారు. సుసంపన్నమైన శక్తివంతమైన భారతదేశంలో అందరం పైకి రావాలంటే నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమన్నారు. మన దేశం శక్తివంతంగా ముందుకు వెళుతుందని, భారతదేశం విశ్వగురువుగా అవతరించనుందన్నారు. ప్రపంచంలో భారతదేశం 3వ ఆర్థికశక్తిగా తయారు కాబోతుందన్నారు. అమెరికా, చైనా దేశాలతో పోటీపడే స్థాయికి భారతదేశం వస్తుందన్నారు. డిజిటల్ అంతిమ లక్ష్యం ప్రజలను సంతోషంగా, సుఖవంతం చేయడానికేన్నారు. వ్యవసాయం అనేది మన ప్రాథమిక సంస్కృతి అని, రైతులను బతికించుకోవడం దేశ ప్రజలందరి కర్తవ్యం అన్నారు. ప్రకృతిని మనం ప్రేమిస్తే ప్రకృతి మనలను ప్రేమిస్తుందన్నారు. పిల్లలకు నాయకత్వ లక్షణాలు నేర్పించాలని, వాళ్లను నిరుత్సాహ పర్చవద్దని తల్లిదండ్రులకు సూచించారు. వకృత్వ, వ్యాసరచన పోటీలలో పాల్గొనేవిధంగా, క్రీడలలో పాల్గొనే విధంగా, పదిమంది ముందు, పది మందితో మాట్లాడటాన్ని విద్యార్థులకు చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలని సూచించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత..

కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్ నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు ముఖ్య అతిథులు అందజేశారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, బనగాన పల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మద్రాసు ఫర్టిలైజర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటరావు, టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల వెంకటేశ్వరరావు, పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల డైరెక్టర్ కే.నాసరయ్య, బాజీ చౌదరి, స్వాతి, సురేఖ పాల్గొని బహుమతులు అందజేశారు.

టీడీపీ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్
- వైసీపీ వీడి టీడీపీలోకి పలువురి చేరికలు

రేపల్లె, జనవరి 17: రాష్ట్రంలో సైకో జగన్ పాలన తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టీడీపీ పార్టీకి ప్రతి కార్యకర్త అండగా నిలవాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం కూచినపూడిగ్రామంలో టీడీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము ఆధ్వర్యంలో కూచినపూడి పంచాయతీకి చెందిన వైసీపీ నేతలు ఇంకొల్లు తిరుపతయ్య, నాగమల్లేశ్వరరావు అన్నపరెడ్డి తాతారావు, శివయ్య, సంపత్, కాటూరి రామకృష్ణ, సుధీర్, గుండబొమ్మల శ్రీనివాస్, తోట రోశయ్య, అన్నపరెడ్డి నాగేంద్రబాబు, నరేంద్ర, అనిల్, కారుమూరి ఫణీంద్ర, కుటుంబరావు, గాదె గోపి, శ్రీనివాస్, ఇమ్మిడి ఆంజనేయులు, కొలసాని పృధ్వికుమార్, వినయ్ ఆకుల శివకుమార్, యశ్వంత్‌కుమార్‌లు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెలేయ అనగాని టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోకి చేరే నాయకులు, కార్యకర్తలకు వారికి అండగా ఉంటామని, ఎలాంటి అధైర్యపడాల్సిన పనిలేదని వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లపాటి యల్లయ్య, ఇంకిశెట్టి శ్రీను, కొలసాని శ్రీనివాసరావు, ఎం.ఉమామహేశ్వరరావు, నిజాంపట్నం జడ్‌పీటీసీ నర్రా సుబ్బయ్య, పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, పూషడపు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ శ్రేణులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



షమీమ్‌ను పరామర్శిస్తున్న ముస్తాక్ అహమ్మద్, ఆలీఖాన్, జీవీ ఆంజనేయులు

టీడీపీ నేతలపై హత్యాయత్నం

- వైసీపీ గుండాల దాడులను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే బొల్లా
- దాడిచేసిన వ్యక్తులను 48 గంటల్లో అరెస్ట్ చేయాలి
- టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ముస్తాక్ అహమ్మద్
- మాజీ ఎమ్మెల్యే జీవీతో కలసి బాధితులకు పరామర్శ

వినుకొండ, జనవరి 17 : టీడీపీ నాయకులపై హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్ట్ చేయాలని టీడీపీ రాష్ట మైనార్టీ అధ్యక్షుడు ముస్తాక్ అహమ్మద్ డిమాండ్ చేశారు. వైసీపీ అరాచకశక్తుల దాడిలో గాయపడి ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్‌తో పాటు మరికొంతమంది వ్యక్తులను బుధవారం పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ముస్లిం మైనార్టీ పార్లమెంటు అధ్యక్షుడు అమీర్ ఆలీఖాన్‌తో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ముస్తాక్ మాట్లాడుతూ పోలీసులు అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, పోలీసులు సక్రమంగా విధులు నిర్వహిస్తే దాడులు జరిగేవి కావని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు వ్యతిరేకంగా ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులకు పాల్పటం వైసీపీ గూండాలకు పరిపాటిగా మారిందన్నారు. ఈ అరాచక చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. బాధిత కార్యకర్తల పక్షాన న్యాయపోరాటం చేస్తామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. అమీర్ ఆలీఖాన్ మాట్లాడుతూ ఓటమి భయంతోనే స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అరాచక వ్యక్తులను ఉసుగొల్పుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. స్థానిక ఈ దాడుల వెనకనున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు త్వరలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నియోజకవర్గంలో అరాచక శక్తు లను ఎమ్మెల్యే బొల్లా ప్రోత్సహిస్తున్నారని, ఇందుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. దాడికి పాల్పడిన వైసీపీ గూండాలను 48 గంటల్లో అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించిన వారిలో నియోజకవర్గ పరిశీలకుడు మానుకొండ శివ ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, నేతలు వెంకట్రావు, పేరయ్య, ఆంజనేయులు, డీసీకొండలు తదితరులు ఉన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు,జనవరి 17: వట్టిచెరుకూరు మండలం కారంపూడిపాడు గ్రామానికి చెందిన తోటకూర చంద్రయ్య(55) అనే కౌలు రైతు బుధవార ఆత్మహత్య చేసుకున్నాడు. వట్టిచెరుకూరు మండల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌలు రైతు చంద్రయ్య గతేడాది 11 ఎకరాలు కౌలుకి తీసుకొని వరి సాగు చేశాడు. ఆ సందర్భంగా వచ్చిన తుఫాన్, వరదల దాటికి కోత కోసిన 6 ఎకరాల పంట వరద ఉధృతికి కొట్టుకు పోయింది. అలాగే 4 ఎకరాల్లో పంట పూర్తిగా నీటమునిగి మట్టిపాలైంది. దీంతో చంద్రయ్య తీవ్రంగా నష్టపోయాడు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు పెరిగి పూర్తిగా రుణభారంలో కూరుకుపోయిన చంద్రయ్య తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం తెల్లవారుజామున గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబీకులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం డీవీసీ ఆసుపత్రికి తీసుకెళ్ళగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చంద్రయ్యకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.



అరుణ్ హల్దర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న అరుణ్‌కుమార్ తదితరులు


ఎస్సీ, ఎస్టీ కేసుల్లో స్టేషన బెయిల్ ఇవ్వొద్దు

- ఎస్సీ కమిషన్ జాతీయ చైర్మన్ అరుణ్‌హల్దర్‌కు విజ్ఞప్తి

గుంటూరు, జనవరి 17: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ జాతీయ చైర్మన్ అరుణ్ హల్దర్‌కు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో భాగంగా నగరానికి విచ్చేసిన చైర్మన్‌ను బుధవారం అరుణ్‌కుమార్ ఆసంఘ నేతలతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తమ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. దళితులపై ఇటీవల దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దాడుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను సక్రమంగా అమలు చేయాలని, ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు పాటించాలని కోరారు. ముఖ్యంగా పెండింగ్‌కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి పేరం నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ ముఖంతో మోదీ పాలన..

- సీపీఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న తెలంగాణ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పొన్నూరుటౌన్, జనవరి17: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖంతో ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తుడన్నాడని సీపీఐ తెలంగాణ కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు అన్నారు. బుధవారం ఆయన పొన్నూరు పట్టణ సమీపంలోని ఆయన స్వగ్రామం సంగుపాలెం కోడూరు విచ్చేశారు. అనంతరం పట్టణ కేంద్రానికి వచ్చిన ఆయన సీపీఐ నేతలతో కలసి విలేకరులతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీకి జగన్‌మోహన్ రెడ్డికి విడదీయరాని అనుబంధం ఉందని, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎన్ని తప్పులు జరుగుతున్నా నరేంద్ర మోదీ చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారని ఆరోపించారు. జగనన్న వదిలిన బాణం, షర్మిల ఎందుకు బయటకు వెళ్లిందో.. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎలా అయ్యిందో చెప్పాల్సిన అవసరం సీఎం జగన్‌పై ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనను రాక్షస పాలనగానే చూస్తున్నారన్నారు. నరేంద్ర మోది, జగన్మోహన్‌రెడ్డి న్యాయ వ్యవస్థలను సైతం ప్రభావితం చేసేలా పాలన సాగిస్తున్నారని, '17 ఏ' పై భిన్న తీర్పులు రావటానికి ఈ ప్రభావితమే కారణమని ఆరోపించారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని ప్రభుత్వ కార్యమైందని, ప్రతిష్ఠా కార్యక్రమంలో ఉండాల్సిన మతాచార్యులు వెలుపల ఉంటే వెలుపల ఉండాల్సిన ప్రధానమంత్రి పెద్ద ధర్మకర్తలా మునిగితేలుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రజల కోసం మంచి ఆలోచనలు చేయకపోతే ప్రజలు తిరిగి నష్టపోతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీపీఐ పొత్తు స్థానిక రాష్ట్ర నాయకత్వం తీసుకుంటుందన్నారు. సమావేశంలో సీపీఐ నేతలు కుప్పలా సత్యనారాయణ, ఆరేటి రామారావు, ఎంఎం ఖుద్దూస్, మహ్మద్‌ఖాలీద్, అధ్యాపకుడు చితరంజన్ తదితరులు పాల్గొన్నారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి వినాశనమే జగన్‌రెడ్డి లక్ష్యం

- రాజధానిని ఒక్క అంగుళం కూడా కదపలేరు : రైతులు
- 1492 వ రోజుకు చేరుకున్న దీక్షలు, ఆందోళనలు

తుళ్లూరు జనవరి 17: అమరావతిని నిర్వీర్యం చేయటమే లక్ష్యంగా సీఎం జగన్‌రెడ్డి పావులు కదుపుతున్నారని రాజధానికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 1492వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ.. రాజధానిని అమరావతి ప్రాంతం నుంచి ఒక్క అంగుళం కూడా కదల్చలేరన్నారు. మూడు రాజధానులు నాటకాన్ని ఇకనైనా ఆపాలన్నారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. అమరావతిని అభివృద్ధి చేయమన్న హైకోర్టు తీర్పును ఇకనైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతివెలుగు కార్యక్రమం నిర్వహించారు. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు వెలగపూడి, మందడం,వెంకటపాలెం, ఉద్దండ్రాయునిపాలెం, నెక్కల్లు అనంతవరం తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు, దీక్షలు కొనసాగాయి.



విలేకరులతో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

న్యాయ వ్యవస్థను దిగజార్చేలా పొన్నవోలు వ్యాఖ్యలు

- మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆగ్రహం

గుంటూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పత్రిక, మీడియాలో ఏఏజీ పొన్నవోలు సుధాకర్ చేసిన వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థను దిగజార్చేలా ఉన్నాయని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 17ఏ చట్టంపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పుపై అడిషినల్ అడ్వకేట్ పొన్నావోలు మాట్లాడటం సమాజాన్నీ తప్పుదోవపట్టించేలా ఉందన్నారు. అవినీతి నిరోధక చట్టం గురించి కోర్టు తీర్పులు ఒకరకంగా చెబితే ఏఏజీ పొన్నవోలు దానికి వక్రభాష్యం చెప్పడం సిగ్గుచేటన్నారు. వివిధ కేసుల్లో ఇంతవరకు కోర్టుకు హాజరుకానివారు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసుల్లో ఇంతవరకు ప్రాథమిక ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించలేదన్నారు. చంద్రబాబుపై నిరాధార ఆరోపణలతో కేసులు పెట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్న మాట వాస్తవంకాదా అని ప్రశ్నించారు. ఒక న్యాయవాదిగా పొన్నావోలు మాట్లాడే తీరు అభ్యంతరకరమన్నారు. సీఐడీ సంస్థ సీఎం జేబు సంస్థగా మారిపోయిందని, దానికి అడ్వకేట్ జనరల్ పొన్నవోలు రాజకీయ నేతగా మారటం నిస్సిగ్గుగా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో 125 అడుగుల ఎత్తు విగ్రహం అమరావతి రాజధాని నడిబొడ్డున పెట్టాలని నిధులు మంజూరు చేసి ప్రారంభం చేస్తే దానిని విజయవాడకు తరలించి ప్రచారం చేసుకోవడం ముఖ్యమంత్రికి సిగ్గుచేటన్నారు. దళిత నియోజకవర్గంలో అంబేడ్కర్ విగ్రహం పెట్టకూడదా అని నిలదీశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టి రూ.300 కోట్ల నిధులను జగన్‌రెడ్డి దోచుకుతిన్నాడని విమర్శించారు. సమావేశంలో ఎం.దారు నాయక్, కంచర్ల శివరామయ్య, ఎన్‌వీవీఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో మంగళగిరిలో

చేనేత కార్మికసంఘ రాష్ట్ర మహాసభలు

మంగళగిరి సిటీ, జనవరి 17: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలు ఈనెల 20,21 తేదీల్లో మంగళగిరిలోని మార్కం డేయ కల్యాణమండపంలో నిర్వహించనున్నట్టు సంఘ రాష్ట్ర ఉపాధ్య క్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. మంగళగిరిలోని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 20వ తేది మధ్యాహ్నం రాష్ట్రస్థాయి సదస్సు జరుగు తుందని, ఈ సదస్సుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ కే.వియన్నరావు, ప్రొఫెసర్ నరసింహారెడ్డి, జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. చేనేత కార్మికులు, నేతలు పెద్దసంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మహాసభల ఆహ్వాన కమిటీ గౌరవాధ్యక్షుడు జొన్నాదుల వరప్రసాద్, సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బత్తూరి మోహన్‌రావు, నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

యడ్లపాడు, జనవరి 17 : ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన బండ్ల భాస్కర్ కొండల సమీపంలో పేకాట శిబిరాన్ని నిర్వహించాడు. ఎర్ర చెరువు ప్రాంతానికి చెందిన కొందరు మద్యం తాగి పేకాట శిబిరం వద్దకు వెళ్లారు. శిబిరాన్ని నిర్వహిస్తున్న భాస్కర్ ఇక్కడకు ఎందుకు వచ్చారంటూ పరుషపదజాలంతో వారిని దూషించాడు. దీంతో ఆగ్రహం పట్టలేక భాస్కర్‌పై దాడిచేశారు. అనంతరం భాస్కర్ తన సామాజికవర్గానికి చెందిన వారిని పెద్ద ఎత్తున పోగు చేసి ఎర్రచెరువు కాలనీవాసులపైకి దాడికి ప్రయత్నించాడు. అప్రమత్తమైన కాలనీ వాసులు కూడా దాడికి సిద్ధమయ్యారు. ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తీవ్ర వాగ్వివాదంతో పాటు తోపులాట జరిగింది. స్థానికుల సమాచారంతో ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు రుకుని ఇరు వర్గాల వారిని చెదరగొట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

78,137 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)కి బుధవారం 82,687 టిక్కీలు విక్రయానికి రైతులు తీసుకురాగా వాటిల్లో 78,137 అమ్మకాలు జరిగాయి. ఇంకా యార్డులో 38,422 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మిర్చి వెరైటీల ధరలు ఇలా...

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	20000	334	11500	11500
నెంబరు. 5	17500	18000	నెంబరు. 5	–	–
273	11000	15000	273	–	–
341	8900	19500	341	14000	17000
4884	12500	13000	4884	–	–
సూపర్ 10	--	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	22500	తేజ	15500	15500
బ్యాడిగి	9000	21000	బ్యాడిగి	–	–
దేవనూరు డీలక్స్	11000	20000	దేవనూరు డీలక్స్	–	–
తెల్లకాయలు	5000	13000	తెల్లకాయలు	5500	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

బకాయిలను వెంటనే చెల్లించాలి

● బ్రాహ్మణ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి నేతల డిమాండ్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని బ్రాహ్మణ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు జే.పార్థసారథి డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలో బుధవారం బ్రాహ్మణ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ 2023వ సంవత్సరంలో సేవా సమితి నిర్వహించిన కార్యక్రమాలను సభకు తెలియజేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎన్జీవో నేత ఎం.నరసింహ మూర్తి మాట్లాడుతూ ఉద్యోగులంతా డీఏ, ఈఎల్, పీఆర్సీ ఇతర బకాయిలు, సకాలంలో జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి పీఎస్ శివన్నారాయణ, బీ.మల్లికార్జున శర్మ, నరసింహారావు, గౌరీనాథ్, అరుణ్ కుమార్, వేణుగోపాలరావు, సీతా రమేష్ , కోటేశ్వరరావు, ఏకా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం ఘనత చంద్రబాబుదే

గుంటూరు(తూర్పు), జనవరి17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు ఆశయాలను అనుసరిస్తూ సంక్షేమం అభివృద్ధికి దిక్సూచిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటుకు కృషి చేసిన గొప్ప నాయకుడు చంద్రబాబు నాయుడు అని టీడీపీ నాయకులు కొర్రపాటి సురేష్ అన్నారు. బుధవారం నగరంపాలెంలోని ఆయన కార్యాలయంలో సురేష్ విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌రెడ్డి ఒకవైపు రాష్ట్రంలో దళితులపై దాడులు చేస్తూ మరోవైపు అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభించడంపై ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు అంబేడ్కర్ వారసులు సిగ్గుతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహం పెట్టి నాలుగు మాయమాటలు చెబితే అమాయక దళితులు జగన్ పాలనలో జరిగిన దుర్మార్గాలు మరిచిపోయి ఓట్లు వేస్తారనుకోవడం పొరపాటని తెలిపారు. దళితులంతా జగన్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగి బుద్ధి చెబుతారని సురేష్ స్పష్టం చేశారు.



రూ.2,01,116 చెక్కు అందజేస్తున్న కమిటీ సభ్యులకు అందజేస్తున్న దాతలు

మహాప్రస్థానం సేవా సమితికి వితరణ

గుంటూరు(విద్య),జనవరి 17 స్థానిక బొంగరాలబీడులోని మహా ప్రస్థానం అభివృద్ధి కోసం దాతలు చెరుకూరి చినమాల కొండయ్య భార్య చెన్నమ్మ, శ్రీనివాసరావు తన సతీమణి శ్రీలక్ష్మి తదితరులు రూ.2,01,116 చెక్కును బుధవారం కమిటీ సభ్యులకు అందజేసారు. శ్మశాన వాటిక అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని కమిటీ కార్యదర్శి యార్లగడ్డ అంకమ్మ చౌదరి తెలియ జేశారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి లంక విజయసారథి, కమిటీ సభ్యులు , కల్లూరు రమణయ్య, జంగాలపల్లి పార్థసారథి, ధనియాల గాంధీ, కూనల మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌లో వివరాలు సక్రమంగా ఉండాలి

గుంటూరు, జనవరి 17: రాష్ట్రంలో పెన్షనర్ల మరణానంతరం కుటుంబ పెన్షన్ మంజూరు కావాలన్నా, వారికి వయస్సు రీత్యా వచ్చే అదనపు పెన్షన్ రావాలన్నా, వయస్సు నిర్ధారణ, ఇంటి పేరు వివరాలు సక్రమంగా ఆధార్ పత్రంలో నమోదై ఉండాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్లు మరణించినప్పుడు వారి కుటుంబ సభ్యులకు కుటుంబ పెన్షన్ మంజూరు కావాలన్నా, అదనపు పెన్షన్ ఖచ్చితమైన తేదీకి మంజూరు కావాలన్నా, అర్హతగల కుటుంబ సభ్యులు ఖచ్చితమైన వయస్సు నిర్ధారణ వివరాలు, తమ పుట్టిన ఇంటి పేరు కాకుండా మరణించిన పెన్షనర్ ఇంటి పేరుతో వివరాలు ఆధార్ కార్డులో నమోదై ఉండాలన్నారు. లేకుంటే ప్రభుత్వం వారికి తోచిన వివరాలు తీసుకొని ఏది లాభదాయకంగా ఉండే ఆతేదీకి అదనపు పెన్షన్ మంజూరు చేసే అవకాశం ఉంటుందన్నారు. చాలామంది కుటుంబ సభ్యులకు వివాహం అయిన తర్వాత పుట్టింటి పేరే ఆధార్ కార్డులో నమోదై ఉంటుందన్నారు. వారు పెన్షనర్ ఇంటి పేరునే తమ ఇంటి పేరుగా ఆధార్ కార్డులో నమోదు చేసుకోవాలని సూచించారు. అప్పుడే సులభంగా కుటుంబ పెన్షన్, అదనపు పెన్షన్ పొందుతారని వీరయ్య తెలిపారు.

మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్

● కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి
● విగ్రహావిష్కరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపు



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రమాలికను ప్రారంభించిన కలెక్టర్, జే సీ తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి17: సమానత్వం, సమాన హక్కులతో సుభిక్షంగా జీవించటానికి భారత రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి కొనియాడారు. ఈనెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా బుధవారం కలెక్టరట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో 'సామాజిక సమతా సంకల్ప' జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ చేకూరి కీర్తి, డీఆర్వో చంద్రశేకరరావుతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి సామాజిక ఉద్యమ కారుల జీవిత విశేషాలను, ఆయన సమాజానికి అందించిన సేవలను భావితరాలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి అయన స్ఫూర్తిని తెలియజేయాలని సంకల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు విశేషాలను సాంఘిక సంక్షేమశాఖ డీడీ మధుసూదనరావు పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. అంతకు ముందు బీ ఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర విశేషాలతో రూపొందించిన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి, అధికారులతో కలసి ఫోటో ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీందర్, లక్ష్మీకుమారి, డ్వామా పీడీ శివరామిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కే.స్వాతి ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛంధ రక్తదాన శిబిరం

గుంటూరు (మెడికల్) జనవరి 17: సామాజిక సమతా సంకల్పం అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జనవరి 18న గురువారం ఉదయం 9 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కే. విజయలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేసే సిబ్బందితో పాటు సమాజ శ్రేయస్సు కోరే యువతీ, యువకులు స్వచ్చందంగా ముందుకు వచ్చి ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని ఆమె కోరారు.

ముగిసిన ఏఈఎల్‌సీ యూత్ కన్వెన్షన్

గుంటూరు సిటీ, జనవరి 1: గుంటూరు ఏసీ కళాశాల ప్రాంగణంలో ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘం(ఏఈఎల్‌సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ కన్వెన్షన్-2024 ముగింపు సభ బుధవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 'యూనివర్సిటీ క్రిస్టియన్ ఐడెంటిటీ' అనే అంశంపై సురేష్ వంగూరి ఉపన్యసించారు. లూథరన్ వరల్డ్ ఫెడరేషన్ యూత్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ సవన్న అమెరికాలోని చికాగో నగరం నుంచి కార్యక్రమంలో పాల్గొన్న యువకులతో జూమ్ ద్వారా చర్చా గోష్టి నిర్వహించారు. 'ప్రకృతిని కాపాడుటలో యువత పాత్ర' అనే అంశంపై సవన్న ప్రసంగించారు. యూత్ కన్వెన్షన్‌లో 2000 మంది ఒకేసారి పాల్గొనటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువత దేవుని వైపు నడచి ఏసుక్రీస్తు ప్రభువు దీవెనలు పొందుట చాలా సంతోషాన్ని కలిగించినదని మోడరేటర్ బిషప్ కేఎఫ్ పరదేశి బాబు అన్నారు. కార్యక్రమంలో యువతి యువకులు, ఏసీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఏఈఎల్‌సీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సభలో పాల్గొని ప్రసంగిస్తున్న ప్రోగ్రాం డైరెక్టర్



నిరసనల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండించండి

● 37వ రోజుకు చేరిన అంగన్‌వాడీల నిరసన
● ఏఐటీయూసీ, ప్రజాసంఘాల నేతల సంఘీభావం
● 19న చుట్టుగుంట సెంటర్ నుంచి భారీ ర్యాలీ

గుంటూరు(తూర్పు), జనవరి17: తమ సమస్యలను పరిష్కారంలో మొండి, నిర్లక్ష్య వైఖరిని పదర్శిస్తున్న ప్రభుత్వ తీరును ప్రతి ఒక్కరూ ఖండిచాలని అంగన్‌వాడీలు కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చేరుకుంది. సమ్మెకు ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీ.రాధాకృష్ణమూర్తి, నాయకులు రావుల అంజిబాబు, అకిటి అరుణ్‌కుమార్, హనుమంతురావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఎండీ అక్బర్, అవాజ్ జిల్లా అధ్యక్షులు షేక్ బాషా సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు ఎస్మాతో దారికి రాకపోవడంతో పెంచిన వేతనాలు జూలై నుంచి ఇస్తామంటూ పాలకులు కొత్త పల్లవి అందుకున్నారని ఎద్దేవా చేశారు. ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జూలై నుంచి వేతనాలు ఎవరు ఇస్తారని వారు ప్రశ్నించారు. ఇటువంటి మాయమాటలను నమ్మే పరిస్థితులో అంగన్‌వాడీలు లేరని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు దీప్తి మనోజ, రాధా మట్లాడుతూ అంగన్‌వాడీల ఉద్యమానికి ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. 19వ తేది చుట్టుగుంట సెంటర్ నుంచి చేపట్టే భారీ ర్యాలీలో జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కే శ్రీనివాస్, అంగన్ వాడీ నాయకులు వెంకాయమ్మ, డీ.వేదవతి, రిహీనా, టీ.రాధా, శివకుమారి, హస్సేన్‌బీ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న కమిషనర్ కీర్తిచేకూరి

సమష్టి కృషితోనే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు

● కమిషనర్ కీర్తి చేకూరిని అభినందించిన కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 17: స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో గుంటూరు నగరపాలకసంస్థ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించడం అభినందనీయమని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి అత్యుత్తమ ర్యాంక్ వచ్చిన సందర్భంగా బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తిచేకూరి, కలెక్టర్‌తో కలిసి ర్యాంక్ మెమోంటోలను పదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ఫాస్ట్ మూవింగ్ (వేగంగా అభివృద్ధి చెందుతున్న స్వచ్ఛ నగరాల్లో) సిటీల్లో 2వ ర్యాంక్, స్వచ్ఛసర్వేక్షణ్-2023లో 17వ ర్యాంక్‌ను సాధించడం అభినందనీయ మన్నారు. గతంలో 108 ర్యాంక్‌లో ఉన్న నగరం ఈ ఏడాది రాష్ట్రంలో వైజాగ్, విజయవాడ, తిరుపతి నగరాలకు ధీటుగా 17వస్థానం సాధించడంలో మేయర్, కమిషనర్‌ల మార్గదర్శనంతోపాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజారోగ్య కార్మికుల సమష్టి కృషి దాగి ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సీహెచ్. శ్రీనివాస్, బీ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎస్.ఈ. సిటీ ప్లానర్ తదితరులు పాల్గొన్నారు.



హబీబ్‌మున్నీసాబేగంను సత్కరిస్తున్న బుద్ధప్రసాద్, లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

కళాకారులు.. సామాజిక ఉద్యమకారులు

● మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్

గుంటూరు, జనవరి 17: కళాకారులు సామాజిక ఉద్యమకారులని, సమాజంలోని అన్ని రకాల రుగ్మతలకు వ్యతిరేకంగా తమ ఆట - పాటల ద్వారా ప్రజలను జాగృతులను చేసి, పరిష్కార మార్గాలను సూచించాలని మాజీమంత్రి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. జనచైతన్యవేదిక, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బృందావన్‌గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికలో 'పాటకు పట్టాభిషేకం' కార్యక్రమం నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో పాట ఎంతో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. ఉద్యమాలకు ప్రాణం పోసేది పాట అన్నారు. సమాజ చైతన్య గీతాలు ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించి సమాజ మార్పునకు దోహదపడ్డాయన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 1990వ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అక్షరాస్యత ఉద్యమంలో షేక్ హబీబ్‌మున్నీసాబేగం చదువు ప్రాధాన్యం తెలిపి పాటలతో నిరక్షరాస్యులను చైతన్యవంతును చేశారన్నారు. పురస్కార గ్రహీత షేక్ హబీబ్‌మున్నీసా బేగంకు రూ.లక్ష నగదును అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, గని, చంద్రనాయక్, సీహెచ్ మస్తానయ్య, పావులూరి రమేష్, జగన్, సినీ నటులు చిట్టినేని లక్ష్మీనారాయణ, రంగం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



అనుసరణీయం.. చిరస్మరణీయం

'కళ కళ కోసం కాదు ప్రజా శ్రేయస్సు కోసం' అని త్రికరణ శుద్ధిగా విశ్వసించి తదనుగుణంగా నడుచుకున్న ఏకైక కథానాయకుడు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు అంటే అతిశయోక్తి కాదు. అనేక చిత్రాల్లో బడుగు, బలహీన వర్గాల పక్షం నిలచి వారి కోసం న్యాయపోరాటం చేసే పాత్రల్లో నటించిన యన్టీఆర్, ఆయా వర్గాల అభిమానాన్ని విశేషంగా చూరగొన్నారు. తనను అంతగా అభిమానించే వారికి ఏదైనా చేయాలన్న తలంపుతోనే యన్టీఆర్ రాజకీయప్రవేశం చేసిన సంగతి కొత్తగా చెప్పవలసిన పనిలేదు. కోట్ల రూపాయలు సంపాదించి, ఆ రోజుల్లోనే కోట్ల ఆదాయం చూస్తూ రాజభోగాలు అనుభవించిన యన్టీఆర్ పేదవాడే దేవుడు అని నమ్మి వారి కోసం 'తెలుగుదేశం' పార్టీ నెలకొల్పి, జనంలోకి వచ్చారు. ఆ రోజుల్లో యన్టీఆర్‌కు జనం పట్టిన బ్రహ్మరథం తరాలు మారినా అనితరసాధ్యంగానే నిలిచింది. కేవలం తొమ్మిది మాసాల్లోనే రాజకీయ రంగంలోనూ అధికారాన్ని చేజిక్కించుకొని, అప్పటికీ ఇప్పటికీ అనితర సాధ్యమైన చరిత్రను సృష్టించారు రామారావు. ఆయన రాజకీయ ప్రవేశాన్ని ఎద్దేవా చేసినవారు, అనుభవరాహిత్యం అని విమర్శించిన వారు సైతం ముక్కున వేలేసుకొనేలా పాలన సాగించి, పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి బడుగు, బలహీన వర్గాల వారి అభివృద్ధికి పాటు పడ్డారు యన్టీఆర్. ఆయన ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇప్పుడు పేర్లు మార్చుకొని, రంగులు వేసుకొని చెలామణీ అవుతున్నాయి. 'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు' అని చాటడమే కాదు, వారి పురోభివృద్ధికి అహర్నిశలూ పాటుపడ్డారు రామారావు. అందుకే తెలుగుదేశం పార్టీ ఈ నాటికీ వెలుగుతూనే ఉంది. జయాపజయాలు ఎలా ఉన్నా, తెలుగుదేశం పార్టీ మనుగడ సాగుతూనే ఉంది. భావితరాలను సైతం ప్రభావితం చేసే దిశగా పార్టీ నడక సాగిస్తోంది. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ విజయదుందుభి మోగించడానికి సిద్ధమవుతోంది. సినిమా రంగంలోనూ, రాజకీయరంగంలోనూ.. వెరసి ప్రజా జీవితంలో తాను ఉన్నప్పుడే కాదు.. తన తదనంతరం కూడా తన ప్రభావం కొనసాగేలా చేయగలగడం ఒక్క యన్టీఆర్‌కే చెల్లింది. అందుకే ఆయన యుగపురుషుడని, శకపురుషుడని చరిత్ర ఆయనకు నీరాజనాలు పలుకుతోంది. యన్టీఆర్ ఆశయసాధన కోసం పాటుపడేవారందరూ మళ్ళీ 'తెలుగుదేశం' పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారు. యన్టీఆర్ ఉండగా, తెలుగుదేశం సాధించిన ఘనవిజయాల కోవకు చెందే రీతిన విజయం సాధించాలని అన్నగారి అభిమానులు ఆశిస్తున్నారు. వారి సంకల్పం ఫలించాలని, యన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కోరుకుందాం.

● కొమ్మినేని వేంకటేశ్వరరావు



వాఘాలో వందేమాతరం

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా భారత వైమానిక దళం నేపథ్యంలో రూపొందుతున్న దేశభక్తి చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మాజీ విశ్వసుందరి మానుషి చిల్లర్ కథానాయిక. ప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో సందీప్ ముద్దా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న విడుదలవుతోంది. ఈ చిత్రంలోని తొలి గీతాన్ని యూనిట్ బుధవారం పంజాబ్‌లోని వాఘా సరిహద్దుల్లో ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ చిత్రబృందంతో పాల్గొన్నారు. వైమానిక దళం యుద్ధానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వచ్చే గీతమిది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. మిక్కీ. జే మేయర్ స్వరపరచగా అనురాగ్ కులకర్ణి ఆలపించారు.

మిల్లర్ కిల్లర్



ధనుష్ కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. సంక్రాంతికి తమిళంతో పాటు ఇతర భాషల్లోనూ విడుదలైంది. ఈ నెల 25న తెలుగు వెర్షన్ విడుదలవుతోంది. ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగు హక్కులు సొంతం చేసుకున్నాయి. వెంకటేశ్, నాగార్జున సోషల్ మీడియా వేదికగా బుధవారం 'కెప్టెన్ మిల్లర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. బ్రిటిషర్లను తుదముట్టించే ఆవేశపరుడైన దేశభక్తుడిగా ధనుష్ సరికొత్త గెటప్పుల్లో కనిపించారు. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయిక. సందీప్ కిషన్, డాక్టర్ శివరాజ్‌కుమార్ కీలకపాత్రల్లో నటించారు. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మించారు. సంగీతం: జీవీప్రకాశ్ కుమార్. సాయి సిద్ధార్థ్

ఫియర్‌కు వేదికగా



హీరోయిన్ వేదిక లీడ్‌రోల్‌లో నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వంలో ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. బుధవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. తొలిషాట్‌కు దర్శకుడు కరుణాకర్ క్లాప్ ఇచ్చారు. నటుడు మురళీమోహన్ స్క్రిప్ట్‌ను యూనిట్‌కు అందించారు. ఈ సందర్భంగా వేదిక మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా మా దర్శకురాలు కథను తయారుచేశారు. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంద'న్నారు. దర్శకురాలు మాట్లాడుతూ 'ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలని ఏడాది పాటు కష్టపడి కథ తయారుచేసుకున్నాను. వేదిక పాత్ర ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'హరిత నా వైఫ్. తన సినీరంగం పట్ల ఇష్టం, వివిధ విభాగాలపై అవగాహన ఉన్నాయి. తను 'ఫియర్'తో దర్శకురాలిగా అరంగేట్రం చేయడం ఆనందంగా ఉంది. వేదిక ఛాలెంజింగ్ రోల్ చేస్తున్నారు' అని తెలిపారు. ఈ చిత్రంలో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసే అంశాలు చాలా ఉన్నాయని అరవింద్ కృష్ణ అన్నారు. పవిత్రా లోకేశ్, షాయాజీ షిండే, అనీష్ కురువిల్ల కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్. సినిమాటోగ్రఫీ: ఐ ఆండ్రూ

'బిట్స్' ఇంజనీరింగ్ అడ్మిషన్ టెస్ట్

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- 'బిట్స్‌ఎట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్ క్యాంపస్, పిలానీ క్యాంపస్, కేకే బిర్లా గోవా క్యాంపస్‌లలో ఈ టెస్ట్‌లో సాధించిన ర్యాంకుతో అడ్మిషన్ పొందవచ్చు. బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులు మొదటి సంవత్సరం పూర్తయిన తరవాత ఇంజనీరింగ్ డ్యూయెల్ డిగ్రీలో చేరే వీలుంది.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

బీఈ స్పెషలైజేషన్‌లు: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫాక్చరింగ్

బీఫార్మసీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ స్టడీస్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బీఫార్మసీ ప్రోగ్రామ్‌కు బయాలజీ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కోదానిలో కనీసం 60 శాతం మార్కులు, మొత్తమ్మీద 75 శాతం మార్కులు ఉండాలి. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి.

దరఖాస్తు ఫీజు: పురుషులకు రూ.3,400; మహిళలకు రూ.2,900; రెండో విడత ఎగ్జామ్ రాయాలంటే పురుషులు రూ.2,000; మహిళలు రూ.1500 అదనంగా చెల్లించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: bitsadmission.com

దిక్సూచి DIKSUCHI

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/UzXVOmHలో చదవండి.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అకడమిక్ కోర్సులు

హైదరాబాద్‌లోని డా. బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్‌ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

డిగ్రీ: బీఏ, బీకాం, బీఎస్సీ

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్‌ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఇవి కాకుండా పీజీ డిప్లొమాలు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.braouonline.in

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో ద్వితీయస్థానంలో నిలిచిన వేజండ్ల బాలికల జట్టు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో వేజండ్ల జట్టు ప్రతిభ

చేబ్రోలు, జనవరి 17: రాష్ట్రస్థాయి మహిళల వాలీబాల్ పోటీల్లో వేజండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిల్చిన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.విజయశ్రీ తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. సంక్రాం తి సంబరాల సందర్భంగా వట్టిచెరుకూరు మండలం, వింజనంపాడు గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల వాలీబాల్ పోటీలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మహిళల జట్లు పాల్గొన్నాయి. ప్రతిభచూపిన వేజండ్ల హైస్కూల్ జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలపాటి ప్రజాయాత్ర పునఃప్రారంభం

తెనాలి రూరల్, జనవరి 17: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్వహిస్తున్న ప్రజాయాత్ర గురువారం నుంచి పునఃప్రారంభం కానుంది. ఉదయం 9 గంటలకు కొలకలూరు గ్రామానికి చేరుకోనున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆ గ్రామంలోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి నందివెలుగు శివారు నుంచి ప్రజాయాత్రగా ప్రారంభమై నందివెలుగు చేరుకుంటారు. ఆ గ్రామ పంచాయతీ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ శ్రేణులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జాషువానగర్ మీదుగా కంచర్లపాలెం గ్రామానికి పాదయాత్రగా వెళతారు. అదే గ్రామంలో రాత్రికి బసచేయనున్నారని మండల పార్టీ అధ్యక్షుడు కేసన కోటేశ్వరరావు తెలిపారు. పార్టీ శ్రేణులందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తెనాలి సీటుపై చంద్రబాబు మాటే శిరోధార్యం

● వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జనవరి 17: తెనాలి సీటుపై టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి మాటే శిరోధార్యమని గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తును అతలాకుతలం చేసిన జగన్‌పై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అలుపెరగని పోరాటం చేస్తున్నారని వారికి తామంతా సహకరిస్తామన్నారు. పొత్తుల్లో భాగంగా తెనాలి సీటు ఎవ్వరికి ఇచ్చినా అధినాయకుడి మాట ప్రకారం నడుచుకుంటామని మురళి స్పష్టం చేశారు. కొందరు నాయకులు ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తున్నారని పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనలను గెలిపించుకుందామని మురళి కోరారు.



జరుగుతున్న కథ నాటికలో సన్నివేశం

ఆకట్టుకున్ననాటికలు

కొల్లిపర, జనవరి 17: మండల కేంద్రం కొల్లిపర అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళా ప్రాంగణంలో శ్రీఅవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ప్రదర్శిస్తున్న నాటికలు పలువురిని ఆకట్టుకున్నాయి. బులితెర నటులు శాస్త్రి, మల్లాది భాస్కర్ హైదరాబాద్ వారు నిర్వహించిన వెన్నెలొచ్చింది హాస్యనాటిక, అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారు నిర్వహించిన నాన్నా నేనొచ్చేస్తా నాటిక, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారు నిర్వహించిన జరుగుతున్న కథ నాటికలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులు గ్రామీణ ప్రాంతానికి అనుగుణంగా నాటికలు ప్రదర్శించడంతో ప్రేక్షకులు నాటికలలో మైమరిచిపోయారు. నాటికలలో నటించిన కళాకారులను శ్రీకళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, అన్నవరపు రమేష్ ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డిలు సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ గుదిబండి చినవెంకటరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, బొల్లిముంత కృష్ణమాష్టారు, కల్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, జొన్నల పేరెడ్డి, ఆరిమండ బసవకుటుంబరెడ్డి, బొంతు పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలలో 'యూనిక్' విద్యార్థుల ప్రతిభ

తెనాలి, మారీసుపేట జనవరి 17: స్థానిక చెంచుపేటలోని యూనిక్ తైక్వాండో అకాడమీలో బుధవారం ఈ నెల 7వ తేదీన మంగళగిరిలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో తమ అకాడమీ క్రీడాకారులు ప్రతిభచాటి 47 కేజీల, 38కేజీల, 29కేజీల విభాగాలలో వరుసగా ఎ.జాహ్నవి, ఎ.చరణ్‌తేజ్, జి.వెంకట శ్రీమంత్‌లు స్వర్ణ పతకాలను సాధించారని కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ నెల 20, 21 తేదీలలో నంద్యాల పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో 37వ రాష్ట్రస్థాయి తైక్వాండో సబ్ జూనియర్ పోటీలకు తమ క్రీడాకారులు ఎంపికైనట్లు తెలిపారు.



తైక్వాండో పోటీలలో స్వర్ణ పతకాలను సాధించిన క్రీడాకారులతో కోచ్ నాగరాజు

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట జనవరి 17: పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పేదప్రజల కోసం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో బుధవారం సజ్జా గౌతమి జన్మదినం సందర్భంగా ఆమె కుటుంబ సభ్యుల సహకారంతో, శివాజీచౌక్‌లో మాజీమంత్రి ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరావు, క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, వెనిగళ్ళ శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, గుమ్మడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిరంకుశ వైఖరి తగదు

● సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్

కొల్లిపర, జనవరి 17: ప్రభుత్వానికి అంగన్‌వాడీలపై నిరంకుశ వైఖరి తగదని సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపరలో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల సాధన కోసం చేస్తున్న సమ్మె 37వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆట పాటలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 37రోజుల నుంచి అంగన్‌వాడీలు సమ్మెచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఎన్నికలముందు ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మండలస్థాయి నాయకులు డి.శివపార్వతి, ఆదిలక్ష్మి, గుంటూరు స్వర్ణలత, దీప్తి, శ్రీలక్ష్మి, సువర్ణలత, మాధవి తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



చేబ్రోలులో అంగన్‌వాడీలకు సంఘీభావం తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

అంగన్‌వాడీల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలి: టీడీపీ

చేబ్రోలు, జనవరి 17: అంగన్‌వాడీల న్యాయబద్ధమైన సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకటరామరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన చేబ్రోలులో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 37వ రోజుకు చేరుకున్నాయి. టీడీపీ నేతలు అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షలకు సంఘీభావం తెలిపి, దీక్షల శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ప్రభుత్వం కఠినవైఖరి అవలంభిస్తుందని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీలను విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరికలు జారీచేయటం దారుణం అన్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరంకి రంగారావు, అనంత లక్ష్మీనారాయణ, తోట శ్రీనివాసరావు, వుయ్యూరు నాగరాజు, పుట్టుంబాక వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా ఉంటాం..

తెనాలి అర్బన్, జనవరి 17: న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న అంగన్‌వాడీలకు అండగా నిలబడతామని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు భావన్నారాయణ పేర్కొన్నారు. విజయవాడ రోడ్డులో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ దీక్షా శిబిరాన్ని బుధవారం సందర్శించారు. 37వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె చారిత్రాత్మకమని ఎస్మాకు సైతం భయపడకుండా పోరాటంలో ఉండటం అభినందనీయమన్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజల్లో మద్దతు పెరుగుతుందని ప్రభుత్వం దిగిరాక తప్పదన్నారు. పరిష్కారానికి టీడీఎఫ్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. కె.బాబుప్రసాద్, షేక్ హుస్సేన్‌వలి, కుమారి, పావని, మరియమ్మ, నీలవేణి, రాధ పాల్గొన్నారు.



అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు భావన్నారాయణ

తెనాలి సీటును ఆలపాటికే కేటాయించాలి

నియోజకవర్గ పార్టీ శ్రేణుల సమావేశంలో తీర్మానం



ఆలపాటి తెనాలి సీటు కేటాయించాలని కోరుతూ తీర్మానం చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి అర్బన్, జనవరి 17: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాన్ని మెజారిటీ కార్యకర్తల అభిప్రాయాన్ని అధిష్ఠానం విని ఎంపిక నిర్ణయం తీసుకోవాలని పలువురు టీడీపీ నాయకులు కోరారు. పార్టీ పిలుపునిచ్చిన ఉద్యమాల్లో ముందుండి నడిపించి కార్యకర్తలకు అండగా ఉన్న ఆలపాటికి తెనాలి సీటు కేటాయించాలని కోరుతూ బుధవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జనసేనకు తెనాలి సీటు ఖరారు అవుతుందని భావించిన పార్టీ శ్రేణులు బుధవారం ఎన్వీఆర్ కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అధ్యక్షతన పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ, అధిష్ఠానం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నియోజకవర్గంలో పార్టీకోసం ఎంతోచేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ కృషిని గుర్తించి న్యాయం చేయాలన్నారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో అహర్నిశలు పని చేసిన ఆలపాటి కృషిని గుర్తించి జనసేనకు మరోచోట అవకాశం కల్పించాలన్నారు.

మున్సిపల్ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ ఖలీల్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ కంచర్ల ఏడుకొండలు, కో-ఆపరేటివ్ సొసైటీ మాజీచైర్మన్ మంగమూరి హరిప్రసాద్, మున్సిపల్ మాజీచైర్మన్ పెండేల వెంకట్రావు, ఎస్సీ నేత బొబ్బిలిపాటి ప్రసాద్, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్, పార్టీ నాయకులు మాదల కోటేశ్వరరావు, న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, మహిళా నేతలు రమ్య, రమాదేవి, జొన్నాదుల మహేష్, మార్కండేయులు తదితరులు ఆలపాటి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కార్యకర్తలకు అండగా నిలిచిన వైనాన్ని వివరిస్తూ ఆయనకు సీటు కేటాయించాలని కోరారు. ఒక దశలో కార్యకర్త షాహుల్ స్టేజిపైకి దూసుకువచ్చి పెట్రోల్ పోసుకునే ప్రయత్నాన్ని నాయకులు అడ్డుకుని ఇలాచేసి పార్టీకి మచ్చ తేవొద్దని అధిష్ఠానాన్ని ఒప్పించేందుకు అందరం వెళదామంటూ నచ్చజెప్పారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణ హత్య

● భార్యతో ఇంటిలో ఉండగా గమనించిన భర్త

● ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ

● మృతుడు తుమ్మలపాలెంలో లైన్‌మెన్



రూఫ్ కుమార్ నాయక్ (ఫైల్‌ఫొటో)

ప్రత్తిపాడు, జనవరి 17: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయిన సంఘటన మండల పరిధిలోని తుమ్మలపాలెంలో బుధవారం జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం తుమ్మలపాలెంలో ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రూఫ్‌కుమార్ నాయక్ (35)కు అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో అక్రమ సంబంధం ఉంది. అయితే బుధవారం మధ్యాహ్నం భర్త ఇంట్లో లేని సమయంలో లైన్‌మన్ కుమార్‌నాయక్ ఇంట్లోకి వెళ్లాడు. వారిరువురు ఇంట్లో ఉండగానే భర్త ఏల్చూరి అర్జునరావు ఇంటికి వచ్చాడు. అయితే లోపల గదికి తలుపులు వేసి ఉండటంతో ఇరువురి మాటలు వినిపించడంతో ఆగ్రహానికి లోనయ్యాడు. వెంటనే తలుపులు తట్టడంతో వారు కొద్దిసేపటికి తలుపులు తీశారు. దీంతో అర్జునరావుకు, నాయక్‌కు మధ్య గొడవ జరగటంతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. అర్జున్ గొడ్డలితో దాడి చేయగా, నాయక్ ఇంట్లో ఉన్న కత్తిపీటతో దాడి చేశారు. ఈ క్రమంలో నాయక్ తలపై గొడ్డలి వేటు పడటంతో అక్కడికక్కడే మరణించాడు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న ప్రత్తిపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సమయంలో అర్జునరావు రక్తపు మరకలతో ఇంట్లోనే ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు ఘర్షణ పడుతున్న సమయంలో భార్య అక్కడినుండి పరారైంది. సంఘటనా స్థలాన్ని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్ భాషా, సీఐ సుబ్బారావు, ఎస్ఐ రవీంద్రలు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

బ్రాహ్మణ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి నేతల డిమాండ్

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని బ్రాహ్మణ ఉద్యోగ ఉపా ధ్యాయ సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు జే.పార్థసారథి డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలో బుధవారం బ్రాహ్మణ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ 2023వ సంవత్సరంలో సేవా సమితి నిర్వహించిన కార్యక్రమాలను సభకు తెలియజేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎన్జీవో నేత ఎం.నరసింహ మూర్తి మాట్లాడుతూ ఉద్యోగు లంతా డీఏ, ఈఎల్, పీఆర్సీ ఇతర బకాయిలు, సకాలంలో జీతాలు అందక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి పీఎస్ శివన్నారాయణ, బీ.మల్లికార్జునశర్మ, నరసింహారావు, గౌరీనాథ్, అరుణ్ కుమార్, వేణుగోపాలరావు, సీతా రమేష్, కోటేశ్వరరావు, ఏకా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులు.. సామాజిక ఉద్యమకారులు

● మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్



హబీబ్‌మున్నీసాబేగంను సత్కరిస్తున్న బుద్ధప్రసాద్, లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి తదితరులు

గుంటూరు, జనవరి 17: కళాకారులు సామాజిక ఉద్యమకారులని, సమాజంలోని అన్నిరకాల రుగ్మతలకు వ్యతిరేకంగా తమ ఆట - పాటల ద్వారా ప్రజలను జాగృతులను చేసి, పరిష్కార మార్గాలను సూచించాలని మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. జనచైతన్యవేదిక, సీనియన్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బృందావన్‌గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికలో 'పాటకు పట్టాభిషేకం' కార్యక్రమం నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో పాట ఎంతో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. ఉద్యమాలకు ప్రాణం పోసేది పాట అన్నారు. సమాజ చైతన్య గీతాలు ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించి సమాజ మార్పునకు దోహదపడ్డాయన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 1990వ దశాబ్దాంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అక్షరాస్యత ఉద్యమంలో షేక్ హబీబ్ మున్నీసాబేగం చదువు ప్రాధాన్యం తెలిపి పాటలతో నిరక్షరాస్యులను చైతన్యవంతులను చేశారన్నారు. పురస్కార గ్రహీత షేక్ హబీబ్‌మున్నీసా బేగంకు రూ.లక్ష నగదును అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, గని, చంద్రనాయక్, సీహెచ్ మస్తానయ్య, పావులూరి రమేష్, జగన్, సినీ నటుడు చిట్టినేని లక్ష్మీనారాయణ, రంగం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి

తెనాలి రూరల్, జనవరి 17: ట్రావెల్ బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనలో తీవ్రగాయాలైన వృద్ధురాలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి సమయంలో నందివెలుగు జంక్షన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కొలకలూరు గ్రామానికి చెందిన గుంటూరు వెంకాయమ్మ (68)కు, ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు జీజీహెచ్ తరలించగా వెంకాయమ్మ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



గృహాల ముందు కాల్వ నిర్మాణం కోసం పగలగొట్టి శిథిలాలు వదిలివేసిన కాంట్రాక్టర్, రోడ్డు మార్జిన్లలో నిల్వ ఉన్న శిథిలాలు

కాంట్రాక్టర్ అలసత్వం వార్డు వాసులకు శాపం

పొన్నూరు టౌన్, జనవరి 17: అనుమతులు లేకుండా పనులు మొదలుపెట్టి పనులను మధ్యలోనే వదిలివెళ్లిన కాంట్రాక్టర్ అలసత్వం పట్టణ వాసులకు శాపంగా మారింది. పొన్నూరు పట్టణంలోని 5వ వార్డులో స్థానికులు ఇటీవల రోడ్డు నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ అధికారులకు విన్నవించారు. ఐతే ఏమైందో ఏమో తెలియదు కానీ కాంట్రాక్టర్ ఇటీవల కొత్త కాల్వ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. రోడ్డు మార్జిన్లలో ఉన్న మురుగు కాల్వలను కూల్చివేసి శిథిలాలను తొలగించకుండా వదిలిపెట్టారు. అనుమతులు లేకుండా కాల్వ నిర్మాణ పనులు చేపట్టడంపై స్థానికులు ప్రశ్నించటంతో కాంట్రాక్టర్ ఆ వైపునకు రావటం మానివేసాడు. దీంతో పగల గొట్టిన శిథిలాలతో మురుగు కాల్వలు పూడిపోయాయి. దీంతో మురుగు పారుదల నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నిల్వ మురుగు నీటిలో దోమలు వృద్ధిచెంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లు నిర్మించమని కోరితే అది వదిలివేసి మురుగు కాల్వ నిర్మాణం చేపట్టడంతోపాటు, కాల్వ నిర్మాణ పనులను అర్థంతరంగా వదిలివేయటంపై వార్డువాసులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించినప్పటికి నేటివరకు స్పందన కనిపించటం లేదని 5వ వార్డు వాసులు ఆరోపిస్తున్నారు.

వెంకట్రామ పౌల్ట్రీఫామ్‌లో చోరీ

ప్రత్తిపాడు, జనవరి 17: మండల పరిధిలోని నడింపాలెం వద్ద జాతీయ రహదారి పక్కన గల వెంకట్రామ పౌల్ట్రీ ఫామ్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పౌల్ట్రీఫామ్‌కు సంబంధించి కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గ్యాస్ కట్టర్ సాయంతో తలుపులు తీసి లోపలకు ప్రవేశించారు. లోపల ఉన్న ఇనుప బీరువా తలుపులను కూడా గ్యాస్ కట్టర్ సాయంతో పగలగొట్టి లోపల ఉన్న రూ.మూడు లక్షల నగదును అపహరించుకుపోయారు. ఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్రబాబు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ నూతన అధ్యక్షులకు సన్మానం

తెనాలి అర్బన్, జనవరి 17: బీజేపీ నియోజకవర్గ, పట్టణ, రూరల్ మండల, కొల్లిపర మండల పార్టీ నూతన అధ్యక్షులను బుధవారం సన్మానించారు. సత్యనారాయణ టాకీసు రోడ్డులోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నూతన కార్యవర్గం కృషి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి ఆదరణ పెరుగుతుందని రాష్ట్రంలో కూడా చెప్పుకోదగిన స్థాయికి చేరుకునేలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గ కన్వీనర్ కరారి వాసుదేవనాయుడు, పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు, కొల్లిపర మండల అధ్యక్షుడు మునగాల కృష్ణమూర్తి, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కడియాల నందకిషోర్‌లను సన్మానించారు. గాజుల వెంకయ్యనాయుడు, కనకదుర్గ, హరికృష్ణ, ప్రశాంతి, రత్నరాజు, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆకివీడులో కోడి పందేల బరి వద్ద కార్ల పార్కింగ్

పండుగ ముగిసినా.. తగ్గని పందేల జోరు

- నాలుగో రోజూ చేతులు మారిన రూ.లక్షలు
- కూడబెట్టిన సొమ్ములూ పోగొట్టుకున్న పేదలు

భీమవరం, ఏలూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బుధవారం కూడా కోడి పందేలు జోరుగా సాగాయి. రూ.కోట్లు చేతులు మారాయి. పండుగ 3 రోజులూ చూసీచూడనట్టుగా వదిలేసే అధికారులు.. నాలుగో రోజు కూడా మౌనం దాల్చారు. బుధవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో యథేచ్ఛగా పందాలు సాగాయి. ఉండి నియోజకవర్గంలోని 4 మండలాల్లోనూ పందేలు నిర్వహించారు. సీసలి, పెదమీరం బరుల్లో ఒక్కో పందెం రూ.25 లక్ష ల నుంచి రూ.50 లక్షల వరకు వెళ్లింది. బయట పందేలు కూ డా లక్షల్లోనే సాగాయి. యలమంచిలిలో మహిళలు సైతం గుండాటలో పాల్గొన్నారు. నాలుగో రోజు చిన్న బరులను కట్టడి చేసిన పోలీసులు.. పెద్ద బరులను వదిలేశారు. పండుగ రోజు ల్లో నిర్వహించిన జూద క్రీడలకు కష్టజీవులు లక్షలాది రూపాయలు సమర్పించుకున్నారు. భార్య నగలు తాకట్టు పెట్టి ఒకరు, కుమార్తె వివాహానికి దాచిన సొమ్ముతో ఇంకొకరు, ప్లాట్ ఫాం బండి నడుపుతూ సంపాదించిన నగదుతో మరొకరు.. ఇలా ఒకరా ఇద్దరా! ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వందలాది మంది పేదలు ఈ జూదాల్లో ఆస్తులు పోగొట్టుకున్నారు.

- దెందులూరుకు చెందిన ఓ రైతు తన సోదరుడితో కలిసి నివసిస్తున్నారు. ఆది నుంచి పేకాట పిచ్చితో ఎన్నో ఆస్తులు పోగొట్టుకున్న అతడు, ఈ సంక్రాంతి పండుగలో సైతం రూ.60 లక్షలకు పైగా పందేల పాలు చేశాడు. దీంతో వారి ఉమ్మడి కుటుంబం విడిపోయే పరిస్థితి వచ్చింది.
- బుట్టాయిగూడెంకు చెందిన ఓ యువకుడు సంక్రాంతి పండుగను సాకుగా పెట్టుకుని ఇంట్లో దాచిన రూ.1.40 లక్షలను నాశనం చేశాడు. పందెంలో ఒడ్డి ఓడిపోయాడు.
- కుమార్తె వివాహం కోసమని ఇటీవల అర ఎకరం పొలం అమ్మగా వచ్చిన రూ.లక్షా యాభై వేలను ఆ దంపతులు బ్యాంకులో దాచుకున్నారు. కుమార్తె వివాహనికి ముహూర్తాలు చూసుకునే క్రమంలో ఆ తండ్రి పందేల పిచ్చితో దాచిన ఆ సొమ్మును కోడి పందేల్లో పెట్టి పోగొట్టాడు. ఇప్పుడు కుమార్తె పెళ్లి ఎలా చేయాలో తెలీక దెందులూరు మండలానికి చెందిన ఆ దంపతులు విలపిస్తున్నారు.
- జంగారెడ్డిగూడెం సమీప గ్రామానికి చెందిన ఓ యువకుడు ఒక కోళ్ల ఫారంలో పనిచేస్తున్నాడు. తన భార్య మెడలో నగలు అమ్మి రూ.40 వేలు, యజమాని వద్ద మరో రూ.20 వేలు అప్పు చేసి మరీ లోనా-బయట జూదం ఆడాడు. చివరకు రూ.10 వేలకు పైగా విలువైన సెల్‌ఫోన్‌ను కూడా తాకట్టు పెట్టేశాడు.



కాళ్లలో కోళ్ల పందేలు

ప్రాజెక్టుల అప్పగింతకు నెల రోజులే గడువు!

- అన్నిటినీ కృష్ణా బోర్డు పరిధిలోకి తేవాలి: కేంద్రం ఆదేశం

అమరావతి/న్యూఢిల్లీ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ నడుమ నదీ జలాల వివాదంపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటిదాకా కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టులను అప్పగించేందుకు అంగీకరించని తెలంగాణపై కన్నెర్రజేసింది. నెలరోజుల్లో కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులన్నింటి ని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ)కి అప్పగించాల్సిందేనని ఆదేశించింది. వారం రోజుల్లోగా బోర్డు చైర్మన్, రెండు రాష్ట్రాల ఇంజనీర్స్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) సమావేశమై.. ప్రాజెక్టులు, అవుట్‌లెట్ల సమాచారాన్ని క్రోడీకరించి.. 15 రోజుల్లోగా పంపాలని ఆదేశించింది. అప్పగింతపై విధివిధానాలను త్రి సభ్య కమిటీ తయారు చేయాలంది. 15 రోజుల్లో పరిస్థితిని సమీక్షిస్తామని వెల్లడించింది. ప్రాజెక్టుల అప్పగింత ప్రక్రియ మాత్రం నెల రోజుల్లో పూర్తికావాలని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మరికొద్ది గంటల్లో మొదలుకానుండగా.. నవంబరు 29 అర్ధరాత్రి సమయంలో ఆంధ్ర పోలీసులు నాగార్జున సాగర్‌డ్యాంపైకి దండెత్తి కుడివైపు గేట్లను తమ అధీనంలోకి తీసుకోవడం.. బలగాలను మోహరించి గేట్లు తెరచి కుడికాలువకు నీరు విడుదల చేయడం.. దీనిపై కేంద్ర హోం, జలశక్తి కార్యదర్శులు అజయ్‌కుమార్ భల్లా, దేబర్షి ముఖర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడం.. తక్ష ణం బలగాలను ఉపసంహరించుకోవాలని సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డిని వీడి యో కాన్ఫరెన్స్‌లో వేర్వేరుగా ఆదేశించడం తెలిసిందే. ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం ఓడిపోవడం.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం చకచకా జరిగిపోయాయి. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక నీటి వాటాలు, విడుదలపై ఆ రాష్ట్రం నుంచి ఎలాంటి కదలికా లేదు. ఈ నెల 5న జరిగిన కేఆర్‌ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో రాష్ట్రానికి కేటాయించిన 45 టీఎంసీలకు లోబడి తాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవచ్చని కేఆర్‌ఎంబీ తేల్చిచెప్పింది. అక్కడ ఎలాంటి లడాయీ జరగలేదు. కానీ గత ఏడాది నవంబరు 29న ఏపీ చేసిన యాగీని మాత్రం కేంద్రం విస్మరించలేదు. దీనిపై బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం, జలశక్తి కార్యదర్శులు భల్లా, ముఖర్జీ నేతృత్వంలో సమావేశం జరిగింది. సమావేశంలో తాజా పరిస్థితిని సమీక్షించిన కేంద్ర కార్యదర్శులు.. నెలరోజుల్లో కేఆర్‌ఎంబీకి కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను అవుట్‌లెట్లతోపాటు అప్పగించాలని అల్టిమేటం ఇచ్చారు. కాగా.. ప్రస్తుతం డ్యాంపై కేంద్ర బలగాలు మోహరించి ఉన్నాయి. అక్కడ నవంబరు 28 ముందునాటి పరిస్థితిని కొనసాగించాలని తెలంగాణ అధికారులు మరోసారి కోరారు. కాగా, దాదాపు పదేళ్లుగా సాధ్యంగాని ప్రాజెక్టుల అప్పగింతను.. ఇప్పు డు నెల రోజుల్లో చేసేయడం సాధ్యమేనా అనే సందేహాలను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం అథారిటీ భేటీ 29కి వాయిదా

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ఈనెల 22వ తేదీన నిర్వహించతలపెట్టిన సమావేశం ఈనెల 29వ తేదీకి వాయిదా పడింది. హైదరాబాద్‌లోని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కు చెందిన కృష్ణా-గోదావరి భవన్‌లో ఈ భేటీ జరుగనుంది. భూసేకరణతోపాటు ప్రాజెక్టు నిర్మాణం, పీపీఏ కార్యాలయాన్ని రాజమహేంద్రవరానికి తరలింపు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

ఒక సెక్షన్.. అనేక ప్రశ్నలు!

(మొదటి పేజీ తరువాయి)

17ఏ సెక్షన్ కింద అనుమతి తీసుకోనంత మాత్రాన కేసు కొట్టేయలేమని తెలిపారు.

ఏది 'దర్యాప్తు'?

'దర్యాప్తు' అనే పదానికి నిర్వచనంలోనూ ఇరువురు న్యాయమూర్తులు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేయడం గమనార్హం. ఈ పదానికి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో కానీ, అవినీతి నిరోధక చట్టంలో కానీ నిర్వచనం లేదని జస్టిస్ బేలా త్రివేదీ అన్నారు. "భారత ప్రభుత్వ ప్రామాణిక ఆచరణీయ విధానం(ఎస్‌ఓపీ) ప్రకారం దర్యాప్తు అంటే ఒక నేరానికి సంబంధించిన సమాచారాన్ని తనిఖీ చేయడం. దర్యాప్తు ప్రారంభం తేదీ నేరానికి సంబంధించింది కానీ, దర్యాప్తు ఏజెన్సీ ఎప్పుడు విచారణ ప్రారంభించిందన్న దాంతో కానీ, ఎప్పుడు ఫిర్యాదు వచ్చిందన్న దాంతోకానీ దానికి సంబంధం లేదు" అని ఆమె పేర్కొన్నారు. సీఆర్పీసీలో 'దర్యాప్తు' అనే పదానికి నిర్వచనం లేదని జస్టిస్ అనిరుద్ధ బోస్ కూడా అంగీకరించారు. సీఆర్పీసీ 1973 కోడ్‌లో సెక్షన్ 2(జీ) ప్రకారం మేజిస్ట్రేట్ కోర్టు లేదా న్యాయస్థానం నిర్వహించేదే దర్యాప్తు అని తెలిపారు. అదే సమయంలో.. 'దర్యాప్తు' అన్న పదానికి ఆక్స్‌ఫర్డ్ లా డిక్షనరీలో సరైన నిర్వచ నం ఉందన్నారు. దీని ప్రకారం దర్యాప్తు అంటే... 'సమాచారం కోసం అన్వేషణ' అని తెలిపారు. స్కిల్ కేసులో సమాచారం కోసం సోదాలు 2021లోనే ప్రారంభమయ్యాయని, అప్పటికి సెక్షన్17ఏ అమల్లోకివచ్చిందన్నారు.

'రిమాండ్' ఆర్డర్ పైనా...

రిమాండ్ ఆర్డర్ విషయంలో ఇద్దరు న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోబోనని జస్టిస్ అనిరుద్ధ బోస్ చెప్పారు. "ఇప్పటికే చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారు. ఐపీసీ నేరాల క్రింద ప్రత్యేక జడ్జి జారీ చేసిన రిమాండ్ ఆర్డర్ చెల్లుతుందా లేదా అన్న దాని జోలికి నేను వెళ్లడంలేదు" అని తెలిపారు. అయితే.. 17ఏ కింద అనుమతి లేనప్పటికీ ప్రత్యేక జడ్జికి రిమాండ్ ఆర్డర్ జారీ చేసే న్యాయ పరిధి ఉంటుందని ఆయన అన్నారు. ఐపీసీ సెక్షన్ల కింద చేసిన ఆరోపణలను ప్రత్యేక న్యాయమూర్తి కోర్టులో చంద్రబాబు సవాలు చేసుకోవచ్చని తెలిపారు. ఇదే అంశంపై జస్టిస్ బేలా త్రివేదీ స్పందిస్తూ.. "రిమాండ్ ఆర్డర్ జారీ చేసే అధికారాలు ప్రత్యేక కోర్టుకు ఉన్నాయి. అందులో ఎలాంటి న్యాయపరమైన లోపం లేదు" అని తెలిపారు. ఆయా అంశాలపై తమ మధ్య భిన్నాభిప్రాయాలున్నాయని ఇరువురు న్యాయమూర్తులూ అంగీకరించారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ అన్వయం, నిర్వచనంపై వేర్వేరు అభిప్రాయాలు వచ్చినందున కేసును సీజేఐకి నివేదిస్తున్నట్లు ఒకే ఆర్డర్ జారీ చేశారు.

జస్టిస్ బోస్ ఇలా...



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో దర్యాప్తు ఎప్పుడు ప్రారంభమైనదన్న విషయానికి జస్టిస్ అనిరుద్ధ బోస్ ప్రాధాన్యమివ్వగా... జస్టిస్ బేలా త్రివేదీ దానికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. 2021కు ముందు స్కిల్ కేసులో అసలు దర్యాప్తు ప్రారంభం కానే కాలేదని జస్టిస్ బోస్ స్పష్టం చేశారు. "2018 జూన్ 5న దర్యాప్తు జరిపించమని విజయవాడలోని ఏసీబీ ఒక అభ్యర్థన చేసింది. ఆ తర్వాత మూడేళ్ల వరకూ ఎలాంటి దర్యాప్తు ప్రారంభమైన సంకేతాలు లేవు. 2021 ఫిబ్రవరి, మార్చి, జూన్, ఆగస్టులో పలు లేఖలు రాసినప్పటికీ దర్యాప్తు జరిగినట్లు ఆధారాలు చూపలేదు. అందువల్ల 2018 జూన్ 5 లేఖతో దర్యాప్తు జరిగినట్లు భావించలేం. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏను నిరాకరించేందుకు ఈ లేఖను సాకుగా చూపలేం. 2018 మే 14న జీఎస్టీ అధికారులు రాసిన లేఖను కూడా దర్యాప్తుగా భావించలేం. 2021 సెప్టెంబరు 9న దాఖలైన ఎఫ్ఐఆర్‌లో కూడా 2018 జూన్ 5వ తేదీ నాటి లేఖ గురించి ప్రస్తావన లేదు" అని జస్టిస్ బోస్ తన తీర్పులో వివరించారు. ఇంకా.. విచారణ దశలోనే సెక్షన్ 17ఏ పోలీసు అధికారిపై ఆంక్షలు విధిస్తుందని, సంబంధిత అథారిటీ అనుమతి లేకుండా ఆ అధికారి ముందుకు కదలడానికి వీల్లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు తన అధికార విధుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నారా, సిఫారసులు చేశారా అన్న విషయంలో సంబంధిత పోలీసు అధికారి ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన దాఖలాలు లభించలేదని ఆయన అన్నారు. "17ఏ అమలులోకి వచ్చిన 2018 జూలై 26కు ముందు జరిగిన నేరాలకూ, ఆ తర్వాత జరిగిన నేరాలకూ మధ్య ఈ సెక్షన్ తేడా చూడలేదు. పోలీసు అధికారి ప్రారంభించిన ఏ విచారణ, దర్యాప్తు, పరిశోధనకైనా అది వర్తిస్తుంది. స్కిల్ కేసులో 2021 డిసెంబరు 9న ఎఫ్ఐఆర్ నమోదైంది. 2023 సెప్టెంబరులో చంద్రబాబు పేరు చేర్చారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ అమలులోకి రాకమునుపు ఈ అంశంపై ఎలాంటి దర్యాప్తు కానీ, విచారణ కానీ, పరిశోధన కానీ జరిగిన దాఖలాలు లేవు. ప్రత్యేక జడ్జి ముందుకు కేసు తీసుకువచ్చిన సమయం కూడా ముఖ్యం" అని జస్టిస్ అనిరుద్ధ బోస్ స్పష్టం చేశారు. "చంద్రబాబు తన అధికార విధుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నందున.. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటే సంబంధిత అథారిటీ అనుమతి అవసరం. అది లేకుంటే ఆయనపై తీసుకున్న చర్యలు చెల్లవు. కావాలంటే సంబంధిత అథారిటీ అనుమతి తీసుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది" అని జస్టిస్ బోస్ తెలిపారు.

జస్టిస్ త్రివేదీ అలా...



అవినీతి నిరోధక చట్టం ప్రధాన లక్ష్యం పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించి అవినీతిని నిరోధించడమే అని జస్టిస్ బేలా త్రివేదీ అన్నారు. నిజాయితీపరులైన 'పబ్లిక్ సర్వెంట్స్' తాము అధికారంలో ఉన్నకాలంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి దర్యాప్తు పేరుతో వేధించకుండా ఉండేందుకే సెక్షన్ 17ఏ ప్రవేశపెట్టారని ఆమె కూడా అభిప్రాయపడ్డారు. సెక్షన్ 17ఏ కొత్తగా వచ్చిందని, దాన్ని ప్రవేశపెట్టిన నాటి నుంచే అది అమలులోకి వస్తుందికాని మొత్తంగా పాత నేరాలకు కూడా వర్తింపజేయరాదన్నది తన అభిప్రాయమని తీర్పులో చెప్పారు. సెక్షన్ 17ఏ 2018 చట్టం తర్వాత జరిగిన నేరాలకే వర్తిస్తుందని, అంతకు ముందు జరిగిన నేరాలకు కాదని ఆమె చెప్పారు. ముందస్తు అనుమతి లేనంత మాత్రాన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయలేమని ఆమె అన్నారు.

వివరణలోనూ కప్పదాటు!

- అక్రమ పదోన్నతులపై దేవదాయ శాఖ సమర్థన
- ఫైళ్లు మాయం కాలేదంటున్న ఉన్నతాధికారులు
- అక్రమం కానప్పుడు విచారణ కమిటీ ఎందుకు?
- ఈ అంశాలు ప్రస్తావించని దేవదాయ శాఖ

అమరావతి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ప్రధాన కార్యలయంలో నిబంధనలకు విరుద్ధంగా సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులు ఇవ్వలేదని, అంతా నిబంధనల ప్రకారమే చేశామని ఉన్నతాధికారులు వెల్లడించారు. 'మరో ఫైల్ మాయం' శీర్షికతో ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై శాఖ కమిషనర్ వివరణ ఇచ్చారు. అందులో కూడా పూర్తి అవాస్తవాలు పొందుపరిచారు. ప్రధాన కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, కేడర్ స్ట్రెంత్‌కు మించి పదోన్నతులు కల్పిస్తున్నారని 2016 నుంచి అనేకమంది ఉద్యోగులు ఫిర్యాదులు చేశారు. నిబంధనల ప్రకారం ఉమ్మడి ఏపీలో 31 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. విభజన సమయంలో ఈ సంఖ్యను 51గా కమలనాథన్ కమిటీకి చూపించారు. దేవదాయ శాఖ అధికారులు కేడర్ స్ట్రెంత్ తప్పుగా చూపించడంతో ఏపీకి 31 పోస్టులు కేటాయించారు. వాస్తవంగా రాష్ట్రానికి 17 పోస్టులు మాత్రమే రావాలి. దీన్ని సరి చేసుకోవాల్సిన ఉన్నతాధికారులు ఆ తర్వాత తప్పులు మీద తప్పులు చేశారు. కేడర్ స్ట్రెంత్‌లో లేకపోయినా 31మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. దీనిపై 2016లో ప్రధాన కార్యాలయంలో 21మంది ఉద్యోగులు అభ్యంతరం తెలిపారు. విచారణ కమిటీని నియమించి, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో ఉంది. మరోవైపు అక్రమ పదోన్నతులపై చాలామంది ఉద్యోగులు వ్యక్తిగతంగా ఇచ్చిన ఫిర్యాదుల ఫైల్ ఆకస్మికంగా మాయమైంది. ఈ విషయం బయటపడకుండా ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులు దాచిపెట్టారు. పైగా వ్యక్తిగతంగా ఫిర్యాదులు చేసినవారికి ఫోన్లు చేసి, అక్రమ పదోన్నతులపై మీరేమైనా ఫిర్యాదులు చేశారా అని ప్రశ్నించారు. అసలు సంగతి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారో, లేదో ఆ విభాగం అధికారులే చెప్పాలి. ఇవేమీ బయటకు రానివ్వకుండా 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు గతంలో కొంతమంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ఇచ్చిన ఆర్డర్లలో కేడర్ స్ట్రెంత్‌లో ఏమైనా సమస్యలు వస్తే వెంటనే రివర్షన్ ఇస్తామని పేర్కొన్నారు. పదోన్నతులు సక్రమంగా కల్పిస్తే ఈ విధంగా పేర్కొనాల్సిన అవసరం ఏమిటని ఉద్యోగులే ప్రశ్నిస్తున్నారు. అక్రమ పదోన్నతులు కాబట్టే అధికారులు అడ్డదారులు వెతుక్కుంటున్నారన్న విమర్శలొస్తున్నాయి. దీనిపై దేవదాయ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

నీలకంఠేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి భారీ విరాళాలు

నకరికల్లు, జనవరి 17: మండలంలోని కుంకలగుంటలో పునర్నిర్మాణంలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి దేవాలయానికి కనుమూరి అంజనేయులు కుమారుడు అప్పారావు రూ.3.5 లక్షలు అందజేసినట్టు నిర్మాణ కమిటీ ప్రతినిధులు ఎరగూటి రోసిరెడ్డి, కనుమూరి సాంబశివరావు తెలిపారు. ఎరగూటి చినరామస్వామిరెడ్డి రూ.2 లక్షలు, కుంకలగుంట మాజీ సర్పంచ్ కనుమూరి దశరథ రామయ్య రూ.2 లక్షలు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి రూ.లక్ష, షైనీడి వెంకటరావు కుమార్తె రాజ్యలక్ష్మి రూ.లక్ష, అర్వపల్లి మురళి రూ.లక్ష, అర్వపల్లి నాగ సత్యనారాయణ రూ.లక్ష, అర్వపల్లి సుభాకరరావు రూ.లక్ష, అర్వపల్లి వెంకట పూర్ణచంద్రరరావు కుమారులు రూ.లక్ష, జవ్వాజి మల్లికార్జునరావు రూ.లక్ష, షైనీడి శివరామకృష్ణయ్య రూ.లక్ష, అర్వపల్లి జగ్గయ్య రూ.లక్ష, కనుమూరి రాజేంద్ర రూ.లక్ష, కొల్లి వరప్రసాదరావు రూ.1,00,116, జవ్వాజి బ్రహ్మయ్య రూ.1,16,999 అందజేశారు.

టీడీపీ ఫ్లెక్సీ ధ్వంసం చేసి కార్యకర్తపై దాడి

ముప్పాళ్ళ జనవరి 17: మండంలోని మాదలలో టీడీపీ ఫ్లెక్సీ వేశాడని దానిని ధ్వంసం చేసి టీడీపి కార్యకర్తపై దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. మాదలలో ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన జవంగుల రవికిరణ్‌పై వైసీపీ కర్యకర్తలు పార్టీ మారుతావా అంటూ దాడి చేశారు. సంఘటనతో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. తన ద్విచక్ర వాహనానికి టీడీపీ స్టిక్కర్ వేసుకుని రావడంతో తన బైకును అడ్డగించి తనపై దాడి చేశారని రవికిరణ్ తెలిపారు.

తెలుగు యువత నాయకుడి బైకు దహనం



దహనమైన మోటార్ బైక్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

నాదెండ్ల, జనవరి 17: మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకుడు నార్నె వీరహనుమ మోటార్ బైక్‌ను మంగళవారం అర్ధ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని వీరహనుమాన్ ఇంటి సమీపంలో నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన తరువాత అర్ధరాత్రి సమయంలో మోటారు బైక్ పెట్రోలు పైపును కత్తిరించి నిప్పంటించారు. గ్రామంలో గడచిన మూడు నెలలుగా 20 మోటార్ బైక్‌ల వరకు చోరీ అయ్యాయి. వీటిలో పదిమంది యజమానులు చోరీకి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గంజాయి బ్యాచ్ ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల క్రితం గంజాయి బ్యాచ్ వ్యక్తుల మధ్య వాటాల విషయంలో ఘర్షణ జరిగి ఒకరిపై ఒకరు కత్తులతో దాడిచేసుకున్నారు. గంజాయి బ్యాచ్‌పై పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మోటార్ బైక్ దహనం విషయంపై బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సంఘటన స్థలాన్ని టీడీపీ నాయకులు బండారుల్లి సత్యనారాయణ, ఐనవోలు రాధాకృష్ణమూర్తి, కె.చెన్నకేశవులు, కమ్మ శ్రీనివాసరావు, నందిగం శివయ్య ఉపసర్పంచ్ నార్నె కోటయ్యస్వామి తదితరులు పరిశీలించారు.

యువకుడి మృతికి కారణమైన డ్రైవర్‌కు జైలు, జరిమాన

సత్తెనపల్లి జనవరి 17 : నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి యువకుడి మృ తికి కారణమైన డ్రైవర్‌కు తొమ్మిది నెలలు జైలుశిక్ష, రూ.5 వేల జరి మాన విధిస్తూ సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ బుధవారం తీర్పు ఇచ్చారని ఏపీపీ వడితే ప్రసాద్ నాయక్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మండలంలోని నెమలికల్లుకు చెందిన బుల్లా అనీల్ కు మార్, నకరికల్లు మండలం కుంకలగుంటకు చెందిన వేమూరి మహేష్‌ను సీసీ రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం సూపర్‌వైజర్‌గా తీసుకుని వచ్చాడు. అనీల్ కుమార్ ట్రాక్టర్ నడుపుతూ మహేష్‌ను ఎక్కించుకుని నెమలికల్లు నుంచి ఉంగుటూరు వెళుతుండగా నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపటంతో అది మహేష్ మీద బోల్తాపటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకయ్య ఫిర్యాదుతో అమరావతి పోలీసులు 2017లో కేసు నమోదు చేశారు. సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నేరారోపణ రుజువు కావడంతో సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ ముద్దాయి బుల్లా అనీల్ కుమార్‌కు తొమ్మిది నెలలు జైలు శిక్ష రూ.5 వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారని ప్రసాద్ నాయక్ తెలిపారు.

మాదల బీసీ కాలనీలో ఇరువర్గాల రాళ్ల దాడి

- బాలికతో పాటు మరో ఇద్దరికి గాయాలు

ముప్పాళ్ళ జనవరి 17: మండలంలోని మాదల బీసికాలనీ ఇరువర్గాల మధ్య జరిగిన రాళ్ళ దాడిలో 13 సంవత్సరాల బాలికకు గాయమవ్వగా మరొకరికి కత్తి గాయమైన సంఘటన బుదవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాదల బీసీ కాలనీ వాసులపై పలు ప్రాంతాలలో దొంగ బంగారం, బంగారం దొంగతనం కేసులున్నాయి. తమ విషయాలను పోలీసులకు తెలియజేస్తున్నారని, అందుకే పోలీసులు తమపై కేసులు పెడుతున్నారని, తాము గ్రామంలోకి రాగానే విషయాన్ని పోలీసులకు చెబుతున్నారని కొంత కాలంగా ఇరువర్గాల వారు గొడవ పడు తున్నారు. నెలరోజుల క్రితం కూడా గొడవ పడటంతో ఇరువర్గాలను ముప్పాళ్ళ పోలీసులు బైండోవర్ చేశారు. మరలా బుధవారం రాత్రి ఇరువర్గాల వారు రాళ్ళతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఒక బాలిక తలకు రాయి తగలడంతో గాయమైంది. సంఘటనలో మరో ఇద్దరికి గాయాలైనట్లు సమాచారం. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కిషోర్ తెలిపారు.

కాలువ కట్టల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం

- ఎన్ఎస్‌పీ ఎస్ఈ వరలక్ష్మి



పెరుమాళ్లపల్లి మేజర్ కాలువను పరిశీలిస్తున్న ఎన్ఎస్‌పీ ఎస్ఈ వరలక్ష్మి

వినుకొండ టౌన్, జ నవరి 17: ఎన్ఎస్‌పీ కాలువ కట్టలను ఆక్రమించినా, కాలువ కట్టలపై అక్రమ కట్టడాలు నిర్మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్ఎస్‌పీ ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు. నాగార్జున సాగర్ నుంచి ప్రజల దాహార్తిని తీర్చేందుకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో బుధవారం ఆమె పెరుమాళ్లపల్లి మేజర్‌కాలువను సందర్శించారు. పీకేసీ వద్ద నీటి ప్రవాహాన్ని ఆమె పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. తన పరిధిలోని 231 ట్యాంక్‌లకు నీటిని నింపడం జరుగుతుందన్నారు. అద్దంకి బ్రాంచి కెనాల్‌తో పాటు మెయిన్ కాలువలకు ఈ నెల 19వ తేదీ వరకు నీటిని విడుదల చేయడం జరుగుతుందని, ఇప్పటికే వినుకొండ పట్టణానికి నీటిని సరఫరాచేసే సింగర చెరువుకు నీటిని అందజేశామన్నారు. పెరుమాళ్లపల్లి మేజర్ కాలువపై విఠంరాజుపల్లి, కొండ్రముట్ల, కొండ్రముట్లపాలెం, అగ్నిగుండాల, కోటప్పనగర్, నరగాయపాలెం తదితర గ్రామాల్లోని తాగునీటి చెరువులకు నీటిని విడుదల చేశామన్నారు. కాలువ కట్టలను ఆక్రమించుకున్న వారితోపాటు మేజర్‌కాలువలో తూములువేసి బ్రిడ్జిలను నిర్మించిన వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీఈ రాజన్‌తో పాటు ఏఈ విజయ్‌కుమార్‌ను ఆమె ఆదేశించారు.

కార్యకర్తల అభిప్రాయాన్ని అధిష్ఠానం వినాలి

తెనాలి అర్బన్, జనవరి 17: మెజారిటీ కార్యకర్తల అభిప్రాయాన్ని అధిష్ఠానం విని తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీపై నిర్ణయం తీసుకోవాలని పలువురు టీడీపీ నాయకులు కోరారు. టీడీపీ, జనసేన పొత్తు నేపథ్యంలో జనసేనకు తెనాలి సీటు ఖరారు అవుతుందని భావించిన పార్టీ శ్రేణులు బుధవారం ఎన్‌వీఆర్ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఆలపాటికి తెనాలి సీటు కేటాయించాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అధ్యక్షతన పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆలపాటికి సీటు ఇస్తేనే తెనాలిలో గెలుస్తుందని రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని బయట పడేయటానికి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లు తెనాలి సీటును ఆలపాటికి ప్రకటించాలని కోరారు.

మత్స్య వర్సిటీలో తిమింగలం

- సీనియర్స్‌ను కాదని జూనియర్‌కు అందలం
- ప్రభుత్వ అండతో కీలక అధికారి ఇష్టారాజ్యం
- సామాజికవర్గం పేరుతో తోటి ఉద్యోగులకు బెదిరింపులు
- బంధువుకు రొయ్య పిల్లల సేకరణ బాధ్యత.. నచ్చిన ధర చెల్లింపు
- కాలేజీకి రాని వారికీ హాజరు... ప్రాక్టికల్స్ లేకున్నా గ్రేడులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర మత్స్య విశ్వవిద్యాలయంలో ఓ కీలక అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తనను ప్రశ్నించిన వారికి చుక్కలు చూపిస్తున్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపైనా ప్రతాపం చూపుతున్నారని పలువురు వాపోతున్నారు. తన సామాజిక వర్గాన్ని బూచిగా చూపి, తోటి ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఆ కీలక అధికారిపై ఫిర్యాదు చేయడానికి బాధిత ఉద్యోగులు జంకుతున్నారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నుంచి మత్స్య విభాగాన్ని విడదీసిన వైసీపీ ప్రభుత్వం ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ యాక్ట్-2020 ద్వారా నరసాపురం కేంద్రంగా మత్స్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. వర్సిటీ నిర్మాణానికి 40ఎకరాలు సేకరించింది. రూ.332 కోట్లతో డీపీఆర్ ఆమోదించింది. మొదటి దశలో పరిపాలనా భవనం, విద్యార్థుల వసతి గృహాలు, ఇతర నిర్మాణాలకు రూ.100 కోట్లు మంజూరు చేసింది. గతేడాది బడ్జెట్‌లో రూ.40కోట్లు ప్రతిపాదించింది.

నచ్చితే పదోన్నతులు... నచ్చకుంటే బదిలీలు

భవన నిర్మాణ నిర్మాణాలకు 2022 నవంబరులో సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అయినా ఇంతవరకు భవన నిర్మాణాలేవీ పునాది దశ దాటలేదు. తాత్కాలిక రోడ్లు వేసి వదిలేశారు. వర్సిటీ హెడ్ ఆఫీస్‌ను విజయవాడలో అద్దె భవనంలో పెట్టారు. నరసాపురం సమీపంలో ఒక తుఫాన్ షెల్టర్‌లో పరిశోధన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మూడేళ్ల క్రితం వర్సిటీ చట్టం చేసినా.. తిరుపతి వెటర్నరీ వర్సిటీ నుంచి విభజించినా.. ఇంత వరకు ఫిషరీస్ వర్సిటీకి పూర్తి స్థాయి పాలకమండలిని నియమించలేదు. కనీసం వీసీ నియామకానికి సెర్చ్ కమిటీనీ ఏర్పాటు చేయకుండా ప్రత్యేక అధికారితోనే పరిపాలన కార్యకలాపాలను సాగిస్తోంది. ముఖ్యమైన పోస్టులకు సీనియర్స్‌కు అవకాశం ఇవ్వకుండా జూనియర్‌ను కూర్చోబెట్టింది. దీంతో కీలక అధికారి ఇష్టారాజ్యమైంది. కీలక పోస్టులో ఉన్న వ్యక్తికి సహకరిస్తున్నా.. సదరు జూనియర్ తన హోదా, సామాజికవర్గ రక్షణ చట్టాన్ని ప్రస్తావిస్తూ, తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు సీనియర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నచ్చిన వారికి పదోన్నతులిప్పించి, నచ్చని వారిని బదిలీ చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

అడ్డగోలు అవినీతి... ఆర్టీఐనీ పట్టించుకోరు

కీలక అధికారి అండతో వర్సిటీ పరిధిలోని ఒక కాలేజీ ప్రిన్సిపాల్ కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల పరిశోధనల కోసం వాడే ఆర్‌కేవీవై నిధులకు లెక్కా పత్రం లేదని తెలిసింది. రివాల్వింగ్ ఫండ్ ఎంత వచ్చింది? ఎంత ఖర్చు చేశారన్న వివరాలు చూపకుండా, నకిలీ బిల్లులతో నిధులు మాయం చేస్తున్నారని, డొనేషన్లు వసూలు చేసి, సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల పరిశోధన కోసం ఉపయోగించే రొయ్య పిల్లలను హేచరీల నుంచి కీలక అధికారి తన సమీప బంధువుతో సరఫరా చేయిస్తున్నారు. ఒక్కో రొయ్య పిల్ల మార్కెట్‌లో 35పైసలు ఉంటే, 75పైసలు బిల్లు పెడుతున్నారని సమాచారం. సమాచార హక్కు చట్టం కింద అడిగినా వాస్తవాలు వెల్లడించడం లేదంటున్నారు. కళాశాలకు రాని విద్యార్థులకూ హాజరు వేస్తున్నారని, గత ఏడాది పీజీ విద్యార్థులు ఉత్తీర్ణత ప్రమాణాలు సరిగా పాటించకుండా, ప్రాక్టికల్స్ జరగకపోయినా, తమకు నచ్చిన వారికి గ్రేడ్‌లు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇంటిగ్రేటెడ్ ఫాంలో ఒక గేదె చనిపోతే, కింది స్థాయి సిబ్బందిని బాధ్యుల్ని చేసి, బదిలీ చేశారని సహచర సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణలో డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్

- మరో 7వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- మొత్తం 12 వేల కొలువులతో మెగా డీఎస్సీ!
- కసరత్తు పూర్తి చేసిన అధికారులు

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం మెగా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. గతంలో ప్రకటించిన పోస్టులకు అదనంగా మరిన్ని పోస్టులను చేర్చనుంది. ఇందుకోసం అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగానే ఈ నోటిఫికేషన్ జారీ చేసేందుకు వీలుగా అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ప్రభుత్వం అనుమతించిన వెంటనే ఈ ప్రక్రియ చేపట్టాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల వారీగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులపై విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు సమాచారం. రాష్ట్రంలో 5,089 టీచర్ పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, వీటికి అదనంగా మరో 7వేల దాకా పోస్టులను చేర్చి.. మొత్తం సుమారు 12 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ: కోమటిరెడ్డి

నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడు ఈ విషయం చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.